

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | గురువారం 22-10-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:68 | పేజీలు:4 | వెల: రూ.1/-




పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరస్థూపం వద్ద నివాళి అర్పించిన ప్రధాని మోడీ

# కరోనాపై అవగాహన కలిగి ఉండాలి

**రకరకాల ప్రచారాలపై అప్రమత్తత అవసరం**

**వేడినీళ్ల స్నానంతో కరోనాను అరికట్టలేం**

**వెల్లుల్లి తిన్నంత మాత్రాన వైరస్ను అడ్డుకోలేం**

**ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా అధ్యయనం వెల్లడి**

న్యూఢిల్లీ,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్–19 మహమ్మారి అన్ని వయస్సుల వారిపై ప్రభావం చూపిస్తోంది. ఈ మహమ్మారిపై చేసే యుద్ధంలో ప్రజలు గెలవాలి అంటే ముఖ్యంగా వారికి వ్యాధి పట్ల పూర్తి అవగాహన ఉండాలి. వ్యాధిపై అవగాహన పెంచుకోవడం ద్వారా వైరస్ ప్రమాద తీవ్రతను తగ్గించుకోవచ్చు. ఇందులో భాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ కోవిడ్–19పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి ప్రయత్నించింది. కోవిడ్ పై అవగాహన, పెంచుకుని అప్రమత్తంగా ఉండాలి. హైడ్రాక్సీక్లోరోక్విన్ వల్ల కోవిడ్–19ను నిర్మూలించలేమన్న డబ్ల్యూహెచ్ఓ(ప్రపంచ ఆరోగ్యసంస్థ) మరోసారి సంచలన ప్రకటన చేసింది. ఇప్పటి వరకు కోవిడ్–19 చికిత్సలో ఉపయోగిస్తున్న హైడ్రాక్సీక్లోరోక్విన్, క్లోరోక్విన్లు పెద్దగా ప్రభావం చూపడం లేదని ప్రకటించింది. అంతేకాకుండా కోవిడ్ మరణాల ముప్పును తగ్గించడం గానీ, తక్కువ అనారోగ్యంతో ఉన్నవారికి కూడా పెద్దగా ఉపయోగపడడం లేదని స్పష్టం చేసింది. హైడ్రాక్సీక్లోరోక్విన్, క్లోరోక్విన్లు మలేరియా జ్వరానికి,శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి వినియోగి స్తున్నారు. వీటిని వైద్య పర్యవేక్షణ లేకుండా కోవిడ్ చికిత్సకు వినియోగించడం ద్వారా తీవ్రమైన దుష్ప్రభావాలు కలిగే అవకాశం ఉంటుంది కాబట్టి వీటిని చికిత్సకు వినియోగించకపోవడం మంచిదని తెలిపింది. కోవిడ్–19 కేవలం వృద్ధులపై మాత్రమే కాకుండా అన్ని వయసుల వారిపై ప్రభావం చూపుతుంది. అయితే 60ఏళ్లకు పైబడి ఆస్తమా, డయాబెటీస్, గుండెజబ్బులు ఉన్నవారిపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. అయితే ప్రతి ఒక్కరూ కోవిడ్ వ్యాప్తి చెందకుండా మాస్కు తప్పనిసరిగా ధరించడం, తరచూ చేతులను శుభ్రం చేసుకోవడం, ఇతరులకు కనీసం 6 అడుగుల దూరం పాటించాలి. థర్మల్ స్కానర్లు జ్వరాన్ని మాత్రవే గుర్తిస్తాయి.. కోవిడ్–19ను కాదు:థర్మల్ స్కానర్ కోవిడ్ ఉందో లేదో చెబుతుందన్నది నిజం కాదు. థర్మల్ స్కానర్ అనేది కేవలం మనిషిలో ఉష్ణోగ్రత మాత్రమే చెబుతుంది. తద్వారా జ్వరం ఉన్నదీ లేనిదీ తెలుస్తుంది. మనుషుల్లో కోవిడ్ లక్షణాలు కనిపిస్తున్నాయా లేదా అన్నది గుర్తించడానికి 2 నుంచి 10 రోజుల సమయం పడుతుంది. న్యుమోనియా టీకాలు కోవిడ్ నుంచి రక్షించలేవు: న్యుమోనియా టీకాలు తీసుకోవడం ద్వారా కోవిడ్ నుంచి రక్షణ ఉంటుందన్నది వాస్తవం కాదు. న్యుమోనియా నుంచి రక్షించుకోవడానికి మాత్రమే ఈ వ్యాక్సిన్లను ఉపయోగిస్తారు. కోవిడ్ వ్యాక్సిన్ వస్తే తప్ప మునుపటి ఏ టీకాలు వైరస్ నుండి రక్షణ ఇవ్వలేవు. ముక్కును నిరంతరం సెనిటైజర్తో శుభ్రం చేసుకుంటే కోవిడ్ రాదన్న దాంట్లో నిజం లేదు. ఇలా సెనిటైజర్తో ముక్కును శుభ్రం చేసుకుంటే కోవిడ్ రాదన్న దానికి ఎలాంటి ఆధారాలు లేవు. అయితే జలుబు వచ్చినప్పుడు ముక్కును క్రమం తప్పకుండా శుభ్రం చేసుకుంటే ఉపశమనం పొందవచ్చని మాత్రమే చెప్పవచ్చు. ఈగల ద్వారా కోవిడ్ వ్యాపిస్తుందని నిర్ధారించేందుకు ఎలాంటి ఆధారాలు లేవు. కోవిడ్ సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే తుంపర్లు, అతను తాకిన వస్తువులను తాకడం ద్వారా మాత్రమే వ్యాధి సంక్రమిస్తుంది. కోవిడ్–19 వైరస్ ఒకరి నుంచి మరొకరికి సంక్రమించడంలో 5జీ సాంకేతిక పరిజ్ఞానం సాయం చేస్తోందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 5జీ సాంకేతిక పరిజ్ఞానం వాడకం, దీనికి సంబంధించిన తరంగాలతో మానవ వ్యాధి నిరోధక శక్తి బలహీనపడుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ అవుతున్నాయి. వైరస్ వ్యాప్తికి, 5జీ సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధం లేదు. కోవిడ్–19 వైరస్ ఒకరి నుంచి మరొకరికి సంక్రమించడంలో 5జీ సాంకేతిక పరిజ్ఞానం సాయం చేస్తోందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం నిజం కాదు. ఎక్కువ వేడి ఉన్న నీటితో స్నానం చేస్తే కోవిడ్ రాదని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. మనం ఏ ఉష్ణోగ్రత కలిగిన నీటితో స్నానం చేసిన సరే కరోనా వైరస్ చావదు. మనం ఏ ఉష్ణోగ్రత ఉన్న నీటితో స్నానం చేసినా మన శరీరం కొంత సేపటికి తన ఉష్ణోగ్రత క్రమబద్ధీకరిస్తుంది. మరీ ఎక్కువ వేడి నీటితో స్నానం చేయడం వల్ల శరీరంకాలి ఎర్రగా మారే అవకాశం ఉంటుంది. అయితే అందువల్ల కరోనాకు, నీటి ఉష్ణోగ్రతకు, స్నానానికి సంబంధం లేదు. కాకపోతే బయటకు వెళ్లి రాగానే స్నానం చేసి ఇంట్లోకి వస్తే కోవిడ్ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా చూసుకో వచ్చు. అంతేకాని కోవిడ్ ను మాత్రం అంతం చేయలేం. కోవిడ్ వైరస్ ను నివారించడంలో ,చికిత్స చేయడంలో యాంటీబయాటిక్స్ మరీ అంత ప్రభావవంతంగా లేవు. యాంటీబయాటిక్స్ వైరస్ లకు వ్యతిరేకంగా పనిచేయవు. అవి బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా మాత్రమే పనిచేస్తాయి. వేడి మరియు తేమగా ఉండే వాతావరణంతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ కోవిడ్ వైరస్ వ్యాపిస్తుంది. కోవిడ్ వైరస్ ఉన్న ప్రాంతాల్లో మీరు నివసిస్తుంటే వాతావరణంతో సంబంధం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోండి. కోవిడ్ వైరస్ కు వయసుతో సంబంధం లేదు. వృద్ధులు, యువకులు అన్న తేడా లేకుండా అన్ని వయసుల వారికి వ్యాపిస్తుంది. అయితే ఉబ్బసం, మధుమేహం, గుండెజబ్బులు ఉన్నవారిపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. కాబట్టి ముందుజాగ్రత్తగా చేతులతో కళ్లు, నోరు, ముక్కును తాకవద్దు. తరచూ సబ్బు లేదా శానిటైజర్ తో చేతులను శుభ్రం చేసుకోండి. ఇతరులతో భౌతిక దూరం పాటించండి. వెల్లుల్లి అనేది ఆరోగ్యకరమైన ఆహారం. ఇది కొన్ని యాంటీమైక్రోబియల్ లక్షణాలు కలిగి ఉంటుంది. కాబట్టి వెల్లుల్లి తింటే కోవిడ్ వైరస్ రాదు అనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. మద్యం తాగడం వల్ల కోవిడ్ నుంచి రక్షణ పొందవచ్చు అన్నది వాస్తవం కాదు. అతిగా మద్యం సేవించడం వల్ల ఆరోగ్య పాడయ్యే అవకాశం మరింత ఎక్కువ అవుతుంది.

# చెరువుల పటిష్టతపై అధ్యయనం

**15 బృందాలు ఏర్పాటు చేశామన్న రజత్ కుమార్**

హైదరాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోని 185 చెరువులు పూర్తిగా నిండాయని నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రజత్ కుమార్ తెలిపారు. రానున్న రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో చెరువుల పటిష్ఠత, స్థితిగతులను పరిశీలించేందుకు ఇంజినీర్లతో 15 బృందాలను ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. ఇంజినీర్ల బృందం అన్ని చెరువుల పటిష్ఠత, స్థితిగతులను పరిశీలిస్తుందని చెప్పారు. కట్టలు, తూములు దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు అవసమైన నిధులను వెంటనే మంజూరు చేస్తామని పేర్కొన్నారు. గత వందేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా హైదరాబాద్లో ఈ సీజన్లో భారీవర్షాలు పడ్డాయని, దీంతో చెరువులు పూర్తిగా నిండాయని అన్నారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాగల 24 గంటల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్నగర్, ఖమ్మంతో పాటు నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. కొన్ని జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు.

# చెరువులకు ప్రమాదం లేకుండా చూడండి

**నగర ప్రజలు అప్రమత్తంగా ఉండండి**

**ప్రత్యేక బృందాలతో గస్తీ చేయండి**

**అధికారులకు సిఎం కెసిఆర్ ఆదేశం**

హైదరాబాద్,అక్టోబర్21 (ఆర్ఎన్ఎ): భారీ వర్షాలు, వరదల వల్ల హైదరాబాద్ నగర పరిధిలోని చెరువులకు ప్రమాదం జరగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదేశించారు. కనీసం 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నగరంలోని అన్ని చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ , అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నీటి పారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రజత్కుమార్తో సీఎం కేసీఆర్ మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో గత వందేళ్ల కాలంలో ఎప్పుడూ లేని విధంగా భారీ వర్షాలు కురిసాయి. దీంతో పెద్దయెత్తున వరద నీరు వచ్చింది. నగరంలోని వరద నీటితో పాటు, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి చెరువుల ద్వారాకూడా చాలా నీరు నగరంలోని చెరువులకు చేరింది. నగరంలోని చెరువులన్నీపూర్తిగా నిండిపోయాయి. ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం చెరువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చెరువులన్నీ నిండిపోయి ఉండడంతో పాటు, చెరువులకు ఇంకా వరద నీరు వస్తున్నందున కట్టలకు గండిపడడం, కట్టలు తెగడం లాంటి ప్రమాదాలుజరిగే అవకాశం వుంది. కాబట్టి నీరుపారుదల శాఖ ఇంజనీర్లు, అధికారులు, సిబ్బందితో కనీసం 15 బృందాలు ఏర్పాటు చేయాలి. నగరంలోని అన్ని చెరువుల పరిస్థితిని, కట్టల పరిస్థితిని పరిశీలించాలి. ప్రమాదం జరిగే అవకాశం ఉన్న చెరువు లను గుర్తించి ముందు జాగ్రత్తలు చేపట్టాలి. ఎక్కడైనా గండ్లు పడినా, కట్టలు తెగినా వెంటనే రంగంలోకి దిగి మరమ్మతులు చేయడానికి సిద్ధంగా ఉండాలి. చెరువు కట్టలు తెగే అవకాశం ఉన్న చోట, గండ్లు పడే అవకాశం ఉన్న చోట వరద నీటి ప్రభావానికి గురయ్యే ప్రజలను అప్రమత్తం చేయాలి. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు.

# ప్రణాళికా బద్ధంగా బాధితులకు నగదు పంపిణీ

**వరద ప్రభావిత ప్రాంతాల రూట్మ్యాప్ తయారు చేయాలి**

**అధికారులతో సమీక్షలో సిఎస్ సోమేశ్ కుమార్**

హైదరాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు వరద బాధితులకు నగదు సాయం పంపిణీలో అధికారులు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్కుమార్ సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించడానికి ఒక రూట్మ్యాప్ను సిద్ధం చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో సహాయం అందించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. అవసరమైతే ఇతర జిల్లాల నుంచి మనుషులను రప్పించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు అందుతున్న సాయం పై సీఎస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసి పరిధిలో 300 మంది సహాయక బృందాలను, మరో 50 బృందాలను గ్రేటర్ ఆవల ఉన్న మున్సిపాలల్లో ఏర్పాటు చేసి వరద బాధితులకు ఎలాంటి ఇబ్బంది కానీ, ఆలస్యం కాకుండా అధికారులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. వరదసాయాన్ని పర్యవేక్షించేందుకు జీహెచ్ఎంసిలోనూ, సీడీఎంఏ కార్యాలయాల్లో ఒక కంట్రోల్రూమ్ ఏర్పాటుచేయాలన్నారు. జీహెచ్ఎంసి పరిధిలోని ప్రతి సర్కిల్ పరిధిలో 10 బృందాలను ఏర్పాటు చేయాలని, ఇందులో ముగ్గురు చొప్పున బృందాలను నగదు పంపిణీని నియమించాలన్నారు. సహాయ బృందాలకు అవసరమైన నగదును సత్వరం చేరవేసేందుకు రూట్ ఆఫీసర్స్ను వెంటనే నియమించాలని ఆదేశించారు. వరద బాధితులకు సహాయం చేయడంలో ఎలాంటి ఇబ్బంది రాకుండా రాష్ట్రస్థాయి బ్యాంకింగ్ కన్వీనర్లు చొరవ చూపాలని సెలవురోజుల్లోనూ పనిచేసేలా చూడాలనాన్నరు. ఈ కార్యక్రమంలో మున్సిపల్శాఖ కార్యదర్శి అర్వింద్కుమార్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, ఎస్సీడెవలప్మెంట్ శాఖ కార్యదర్శి రాహుల్బొజ్జ, జీహెచ్ఎంసి కమిషనర్ లోకేశ్కుమార్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నగరంలో కొనసాగుతున్న శిథిలాల తొలగింపు

**వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం**

హైదరాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): నగరంలో వరద సహాయక చర్యలను ప్రభుత్వం ముమ్మరం చేసింది. గ్రేటర్ అధికారులు కాలనీల్లో వ్యవర్థాలను తొలగించే పనులను ముమ్మరం చేశారు. అలాగే బస్తీల్లో క్లోరినేషన్ సాగుతోంది. అయితే మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో సహాయ చర్యలకు అంతరాయం కలుగుతోంది. భారీవర్షాల నేపథ్యంలో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పురపాలకశాఖ మంత్రి కే.టీ. రామారావు ఆదేశాల మేరకు శిథిల భవనాల కూల్చివేత పక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నది. గడిచని వారం రోజుల్లో 65భవనాలను కూల్చివేశారు. ఈ భవనాల్లో ఉంటున్నవారిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ డ్రైవ్ ఇలాగే కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సర్కిళ్లవారీగా టౌన్ప్లానింగ్, ఇంజినీరింగు, పోలీసు తదితర విభాగాలతో కూడిన బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రమాదకర భవనాలను గుర్తించి వాటిని తొలగిస్తున్నారు. ఈ క్రమంలోనే గౌలిపురలో, కర్మాన్ఘాట్, బాలాగంజ్, రామంతాపూర్ శ్రీనగర్ కాలనీ, యాకత్పుర, నాచారం తదితర ప్రాంతాల్లో పురాతన ఇండ్లు, ప్రమాదకరంగా ఉన్న ప్రహరీగోడలను జీహెచ్ఎంసీ సిబ్బంది కూల్చివేశారు. ప్రధాన రోడ్లపై గడిచిన మూడురోజులపాటు కన్స్ట్రక్షన్ అండ్ డెబ్రిస్(సీ అండ్ డీ) వేస్ట్ తొలిగింపులో భాగంగా మొత్తం 190 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించగా, 68ప్రాంతాల్లో ఇప్పటివరకు తొలిగించినట్లు అధికారులు తెలిపారు.

మిగిలిన ప్రాంతాల్లో వ్యర్థాల తొలిగింపు పక్రియ కొనసాగుతున్నట్లు వారు పేర్కొన్నారు.

# పోలీసుల త్యాగాలు నిరుపమానం

**వారికి ఘనంగా నివాళి అర్పించిన సిఎం కెసిఆర్**

**అమరుల త్యాగాలు మరువలేనివన్న హోంమంత్రి, డిజిపి**

**రాష్ట్ర వ్యాప్తంగా అమరులకు ఘనంగా నివాళులు**

హైదరాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఘన నివాళులర్పించారు. పోలీసుల సేవలను, త్యాగాలను సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించే పోలీసుల అత్యున్నత త్యాగాలను ఈ దేశం, ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల ఆశయాల కోసం పోలీసు దళాలు పునరంకితం కావాలన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. పోలీస్ అమవీరుల దినోత్సవ సందర్భంగా ఎల్బీ స్టేడియంలో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అసువులుబాసిన అమర పోలీస్, జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. సమాజ భద్రత, ఉజ్వల భవిష్యత్ కోసం ఎందరో పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు త్యాగం చేశారని, చేస్తున్నారన్నారు. త్యాగధనులకు సమాజం రుణపడి ఉందన్నారు. రాష్ట్రంలో పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటున్నారన్నారు. తెలంగాణ పోలీసులకు దేశవ్యాప్తంగా గుర్తింపు వస్తుందన్నారు. కరోనా సమయంలో వారి సేవలు మరువలేనివన్నారు. డీజీపీ మహేందర్రెడ్డి మాట్లాడు తూ..పోలీస్ వ్యవస్థపై విశ్వాసం పెంపొందించే దిశగా చేపట్టిన పలు కార్యక్రమాలతో సత్ఫలితాలు లభిస్తున్నాయన్నారు. తెలంగాణ పోలీస్ శాఖకు దేశవ్యాప్త గుర్తింపు రావడానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, హోం మంత్రి మహమూద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్నారు. అంతకు ముందు హోంమంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

నగరంలోని గచ్చిబౌలి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పోలీస్ అమరవీరుల పేరేడ్ ర్యాలీలో సీపీ సజ్జనార్, అధికారులు పాల్గొన్నారు.



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గౌరవవందనం స్వీకరించిన హోంమంత్రి మహ్మూద్ అలీ.చిత్రంలో డిజిపి మహేందర్ రెడ్డి,నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ ఉన్నారు.

# హైదరాబాద్లో కెటిఆర్ సుడిగాలి పర్యటన

**కెటిఆర్తో పాటు రంగంలోకి మంత్రులు**

**బాధితులకు పరామర్శలు..ఆర్థిక సాయం అందచేత**

**సహాయ పునరావాస చర్యల పర్యవేక్షణ**

హైదరాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): హైదరాబాద్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులతో కలసి కెటిఆర్ బాధితులను పరామర్శిస్తూనే..ఆర్థిక సాయాన్ని అందచేస్తున్నారు. మరోవైపు సహాయ కార్యక్రమాలను కూడా ఆయన పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేపట్టారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని వరద బాధిత కుటుంబాలకు మంత్రులు అందజేస్తున్నారు. ఉప్పల్ నాలా చెరువు వద్ద చేపట్టిన మరమ్మతులను కేటీఆర్ పరిశీలించారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముంపుకు గురైన ప్రజలను కలిసి, వారికి ప్రభుత్వం ప్రకటించిన రూ.10,000 ఆర్థిక మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో వరద బాధితులకు ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను పరిశీలించారు. సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. ముంపునకు గురైన బేగంపేటలోని బ్రహ్మణవాడిలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటించారు. వరద బాధితులకు రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉప్పల తరుణి, అధికారులు పాల్గొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ముంపునకు గురైన లాలాపేట్లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించారు. కేటీఆర్ వెంట డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, స్థానిక కార్పొరేటర్లు ఉన్నారు. వరద ప్రభావానికి గురైన కాలనీల్లో మంత్రి కేటీఆర్ పర్యటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరద బాధిత కుటుంబాలకు రూ. 10 వేల చొప్పున పరిహారం అందజేశారు. బాధితులందరికీ అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో వరద బాధితులకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. తొలిరోజు 1036 మందికి రూ. 10వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించినట్లు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్కుమార్ తెలిపారు. బాధితులకు నగదు పంపిణీలో మంగళవారం 100 టీంలు పాల్గొన్నాయి. ఒక్కో టీంలో ముగ్గురిని నియమించారు. టీంల సంఖ్యను బుధవారం నుంచి రెట్టింపు చేసారు. ఈ సంఖ్యను 200లకు పెంచి ఆర్థిక సాయం అందించే పక్రియను మరింత వేగవంతం చేస్తున్నారు. నగదు పంపిణీ కార్యక్రమాన్ని సీఎస్ సోమేశ్కుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. బాధితులకు వీలైనంత త్వరగా సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఓవైపు ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూనే మరోవైపు వరద కట్టడికి, కాలనీలను శుభ్రం చేసే పక్రియను పర్యవేక్షించారు.

# నగరాన్ని వదలని వానలు

**అక్కడక్కడా ఉదయం మళ్లీ వర్షం**

**అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు**

హైదరాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): రాజధాని హైదరాబాద్ను వానలు వదలడం లేదు. గత మంగళవారం కాళరాత్రిగా మిగిల్చిన వానలు ఈ మంగళవారంతో పాటు బుధవారం కూడా భయపెట్టాయి. మంగళవారం రాత్రి ఉరుములు మెరుపులతో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. అలాగే బుధవారం ఉదయం కూడా పలుప్రాంతాల్లో వర్షం కురిసింది. ఇప్పటికే వందలాది కాలనీలు ఇంకా నీటి ముంపులోనే ఉన్నాయి. ప్రజలు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కొద్దిగా తెరిపినిచ్చిన వాన మళ్లీ విరుచుకుపడింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షం పడింది. ఎప్పటిలాగే ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వరద నుంచి కాస్త తేరుకుంటున్న కాలనీల్లోకి మళ్లీ నీళ్లొచ్చాయి. ఇప్పటికే వరదలో ఉన్న కాలనీలు మరింత మునిగాయి. చాలాచోట్ల ఇళ్లలో మోకాలిలోతులో నీళ్లు నిలిచాయి. ప్రధానంగా జూబ్లీహిల్స్, మాదాపూర్, బంజారాహిల్స్, అమీర్పేట, ఉప్పల్, రామంతాపూర్, చార్మినార్, మెహిదీపట్నం, చాంద్రాయణగుట్ట, చందానగర్, అల్వాల్, ఫీర్జాదిగూడ, మల్కాజిగిరి, నేరెడ్మెట్, జవహర్నగర్, సఫిల్గూడ, కంచన్బాగ్, శంషాబాద్, తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే వరద ముంపులో చిక్కుకుపోయిన ప్రాంతాల పరిస్థితి దారుణంగా తయారైంది. సరూర్నగర్ మండలంలోని కోదండరాంనగర్, సీసల బస్తీ, శారదనగర్, కమలానగర్, ఉప్పల్, ఫీర్జాదిగూడ, మేడిపల్లి, టోలీచౌకీలోని నదీంకాలనీ, పాతబస్తీలోని అరుంధతీకాలనీ, శివాజీనగర్, క్రాంతినగర్, సాయిబాబానగర్, రాజీవ్గాంధీనగర్, ఛత్రినాక, లిమ్రాకాలనీ, సాదత్కాలనీ, ఆల్ జుబైల్కాలనీ, హాశమాబాద్, అలీనగర్లో మళ్లీ వరదనీరు చేరింది. ఇదిలావుంటే ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధుల భయం వెన్నాడుతోంది. ప్రజలు అలర్ట్గా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# మూసీనదికి శాంతి పూజలు

**-బోనం సమర్పించిన టిఆర్ఎస్ నేతలు**



హైదరాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): ఎడతెరిపి లేకుండా దంచికొట్టిన భారీ వర్షాలకు మూసీ నదికి వరద పోటెత్తిన కారణంగా అనేక కాలనీలు నీట మునిగాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా మూసీకి వరద పోటెత్తడంతో.. నగర ప్రజలు అతలాకుతలమయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూసీ ప్రవహించింది. దీంతో మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి.. రాకపోకలను నిషేధించారు. 1908లో మూసీ నదికి భారీ వరదలు రావడంతో.. నాటి నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు వందేళ్ల తర్వాత మూసీకి మళ్లీ వరదలు పోటెత్తాయి. ఈ క్రమంలో వరదల నుంచి హైదరాబాద్ను గట్టెక్కించాలంటూ.. పురానాపూల్ వద్ద మూసీ నదికి బుధవారం హోంమంత్రి మహమూద్ అలీ, మేయర్ బొంతు రామ్మోమన్ తదితరులు శాంతి పూజ చేశారు. గంగమ్మ తల్లికి బోనం, పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలు సమర్పించారు. అక్కడున్న దర్గాలో మహమూద్ అలీ చాదర్ సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అసూయ,ద్వేషాల్ని
ఏ విజ్ఞానశిఖరాలూ కూల్చలేవు !
జ్ఞానాగ్ని జ్వాలలే
అజ్ఞానపుచీకట్లని
అంతమొందించగలవు!!

-మునిమడుగుల రాజారావు.



## బాల గేయం
## దసరా

దశ అరిష్టముల తొలగించే
దిగ్విజయాలను కలిగించే
దసరాయే మన దండి పండుగ!
సరదా సంతోషాల పండుగ! ॥ద॥

అగ్ని వృక్షమను శమీవృక్షమే
'అజ్ఞాతం'లో పాండవులా
ఆయుధాలనే కాపాడింది
అమ్మలాగే ఆదుకొన్నది
"ఉత్తర గోగ్రహణం"లోన
ఉత్తమ జయ మందించింది
దుష్ట రాక్షసుల నందరినీ
దుర్గాయై హతమార్చింది! ॥ద॥

బంగారంగా జమ్మియాకులే
బంధు మిత్రులకు అందిస్తూ
అనురాగాలను పంచుకోగా
ఆచారంగా నిలిచింది!
కొత్త బట్టలతొ పిండి వంటలతొ
గొప్ప పండుగయి వెలసింది
పిల్లలు పెద్దలు అందరికీ
ప్రియమగు పండుగగా వెలిగింది!



– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

## ఇంటి దొంగ
(కథ)

మహిషా పురం లో ఒక ఉన్నత పాఠశాల ఉంది. ఆ పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు విద్యాభ్యాసం చేసేవారు. ప్రధానోపాధ్యాయుడు విట్టల ఆచార్యుడు ప్రతి తరగతికి ఒక తరగతి నాయకున్ని నియమించాడు. ఎనిమిదవ తరగతి లో 30 మంది విద్యార్థులున్నారు. ఈ తరగతికి నాయకుడు వినోద్. అప్పుడప్పుడు ఎనిమిదవ తరగతి లో దొంగతనం జరిగేది. ఆ తరగతిలోని విద్యార్థుల పుస్తకం, నోటుబుక్కు, పెన్ను. పెన్సిల్ వంటి వస్తువులు తరుచుగా ఎవరో దొంగిలించేవారు. వస్తువులు పోయిన వారు ఏడ్చేవారు. ఏడ్చే విద్యార్థిని వినోద్ ప్రధానోపాధ్యాయుని వద్దకు తీసుకొని వచ్చేవాడు. పోయిన వస్తువు గురించి వినోద్ ప్రధాన ఉపాధ్యాయునికి చెప్పేవాడు. ప్రధాన ఉపాధ్యాయుడు వినోద్ బ్యాగు తప్ప మిగతా విద్యార్థుల బ్యాగులన్ని వెతికేవాడు. కానీ పోయిన వస్తువు మాత్రం దొరికేది కాదు. వినోద్ ఏడ్చే విద్యార్థిని తెచ్చే వాడు కావున ప్రధానోపాధ్యాయుడికి వినోద్ మీద అనుమానం వచ్చేది కాదు. ఎక్కడ పారేసుకున్నావో చక్కగా జ్ఞాపకం చేసుకో అని ప్రధానోపాధ్యాయుడు వస్తువు పోయిన విద్యార్థికి అనేవాడు. ఇలా తరగతిలో అనేకసార్లు వస్తువులు పోయేవి. ప్రతిసారి వినోద్ ప్రధానోపాధ్యాయుని వద్దకు రావడం ప్రధానోపాధ్యాయుడు వినోద్ బ్యాగు తప్ప మిగతా విద్యార్థుల బ్యాగు పరిశీలించడం జరిగేది. వస్తువు మాత్రం దొరికేది కాదు. దీనితో ప్రధాన ఉపాధ్యాయుడు ఆలోచనలో పడ్డాడు. తరగతిలోనికి ఎవరు వస్తున్నారు? ఎవరు దొంగతనం చేస్తున్నారు? వస్తువులు ఎక్కడికి పోతున్నాయి? అని ఆలోచించేవాడు. మరి ఒక్క రోజు వస్లువు పోయిన విద్యార్థిని తీసుకొని వినోద్ ప్రధానోపాధ్యాయుడు వద్దకు వచ్చాడు. జరిగిన దొంగతనం గురించి చెప్పాడు. ప్రతిసారి అందరూ విద్యార్థుల బ్యాగులను పరిశీలిస్తున్నాను కానీ వినోద్ బ్యాగును పరిశీలించడం లేదు. ఈసారి వినోద్ బ్యాగును పరిశీలించాలని మనసులో భావించాడు ప్రధానోపాధ్యాయుడు. వెంటనే ప్రధానోపాధ్యాయుడు తరగతి గదికి వెళ్లి అందరూ విద్యార్థులను బయటకు పంపాడు. ఆఫీసుకు వచ్చిన వినోదును వస్తువు పోయిన విద్యార్థికి సైతం ఆట స్థలానికి పంపాడు. విద్యార్థులందరూ ఆట స్థలానికి వెళ్లారు. అందరి బ్యాగులు పరిశీలించకుండా ప్రధానోపాధ్యాయుడు వినోద్ బ్యాగును మాత్రమే పరిశీలించాడు. అతని బ్యాగులో ఇంతవరకు తరగతిలో పోగొట్టుకున్న విద్యార్థుల వస్తువులన్నీ కనిపించాయి. వస్తువులన్నీ చూసి ప్రధాన ఉపాధ్యాయుడు ఆ వస్తువులన్నీ ఆ బ్యాగులో అలాగే ఉంచాడు. వినోదు ను పిలిచాడు చూడు వినోద్! నీమీద నాకు చాలా నమ్మకం ఉంది. అందుకే నీకు తరగతి నాయకునిగా చేశాను. నిజం చెప్పు వస్తువులన్నీ ఎలా పోతున్నాయి. నిన్ను నేను ఏమీ అనను అబద్ధం చెప్పవద్దు అంటూ ఆప్యాయంగా పలుకరించాడు. వినోద్ కు భయం పట్టుకుంది. వణికిపోతున్నాడు. చేసిన తప్పును ఒప్పుకున్నాడు. వస్తువులన్నీ బ్యాగు నుండి తీసి ప్రధానోపాధ్యాయునికి ఇచ్చాడు. ప్రధానోపాధ్యాయుడు తన ఆఫీసుకు వినోద్ ఇచ్చిన వస్తువులన్నీ తీసుకొని వచ్చాడు. ఆట స్థలం లో ఉన్న విద్యార్థులందరినీ పిలిచాడు. ఇదిగో మీ వస్తువులన్నీ దొరికినాయి. పక్క రూములో కనిపించాయి. జాగ్రత్తగా ఉంచుకోండి. అని చెప్పి ఎవరి వస్తువులు వారికి ఇచ్చివేశాడు. వినోద్ గురించి తోటి విద్యార్థులకు తెలియకుండా జాగ్రత్త పడ్డాడు ప్రధానోపాధ్యాయుడు. ఆ రోజు నుంచి వినోద్ దొంగతనం చేయడం మానుకున్నాడు. తన ప్రవర్తన లో మార్పు తెచ్చుకున్నాడు. దీనితో ఎనిమిదవ తరగతి లో ఒక్క వస్తువు కూడా పోలేదు .

నీతి: చెడు అలవాట్లు, దొంగతనాలు చేయడం మంచిది కాదు. నిజం నిలకడ మీద తెలుస్తుంది.



–జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## వానలు

వానలమ్మ వానలు
దంచి కొట్టే వానలు
ఊరువాడలు ముంచెను
వాగు వంకలు పొంగెను
చెరువు కుంటలు నిండెను.
అలరించే నీటి సవ్వడులు
పంటలన్నీ నీట మునిగెను
రోడ్లన్నీ జలమయ్యేను
పాత ఇండ్లు కూలి పాయెను
మురికివాడలు నీటమునిగెను
భూగర్భ జలాలు పెరిగెను
ప్రజలంతా సంతోషించెను

– యాదవరనీ సహస్ర గౌడ్
9441762105

## నాన్న... నాన్నే

ఎనభై ఏళ్ల వయసులోను
నన్ను చూస్తే
ఇరవై ఏళ్ళ మనసు నాన్నది.

ఇరవై ఏళ్ళ వయసులో
నాన్నను వినని
ఎనభై ఏళ్ల బద్ధకం నాది.

తరం తరువాత కాని కనపడలేదు
నూరేళ్ళ నిజం
నాన్నని.

గతం గడిచాక కాని వినపడలేదు
ప్రవహించే ఆ శబ్దం పేరు
ప్రేమని.

–సాహితి
83094 63567

## శవం ఎవరికీ శత్రువు కాదు ...

శవం ఏం తప్పు చేసింది
ప్రాణమే లేకపాయే
ఇంకా ఖననమో దహనమో చేయకుంటే
శవానికి ఊగిసలాటగా జాగరణే
మనకు కనిపించకున్నా
సూక్ష్మ శరీరానికి సూదులు గుచ్చుకున్నట్లే
ఇక్కడే రౌరవ నరకం కదా !

బండ పడ్డట్టు ప్రపంచ రోగం పైన బడి
పురుగులా కొట్టుకుని కొట్టుకుని
ప్రాణాలు పోగొట్టుకున్న మనిషి శవమైతే
ఇంకా ముట్టకపోవుడా
ముట్టు ముట్టు అనుడా
నాగరికత నవ్వులపాలై ఆదిమజాతి ముద్రే !

ఇప్పుడు శవం ఎవరికీ శత్రువు కాదు
ఏం పేరు ?
ఏ పేరు పెట్టి పిలవలేం
అనామకం
శవం ఎవరికీ బాకీ లేదు
సమాజమే శవానికి ఋణపడి ఉంది

ఇప్పుడు శవం ముందు అందరికీ
జ్ఞానోదయం కాకుండా ఎలా ఉంటుంది !
నాల్గు భుజాలు ముందుకు రానే వస్తాయి
పది మంది వెనక వెనక పోతారు
శవంకు అంత్యక్రియలు చేయనే చేస్తారు
మానవత్వం ఉప్పొంగి సాధిస్తుంది

రేపు ఇది వీధి వీధికి పరీక్ష కావచ్చు
మనిషి ఎప్పుడూ ఉత్తీర్ణుడే
శవమైతేనేం అందరినీ ఒకటి చేసి
మానవత్వం మకుటం పెట్టి
నిస్వార్థంగా నిష్క్రమిస్తుంది !



– కందాళై రాఘవాచార్య
8790593638

## మధురిమ ప్రక్రియ

గురువులను పూజించు
చెప్పినట్లు మసలుకో
సన్మార్గాన్ని ఆచరించు
లక్ష్యాన్ని చేరుకో

జనాభా పెరుగుదల
ప్రగతికి వినాశం
జనాభా తగ్గుదల
అభివృద్ధికి అవకాశం

అమ్మ నాన్నలు
జన్మ కర్తలు
ఉపాధ్యాయులు
జ్ఞాన కర్తలు

ఆన్ లైన్ చదువులు
అందాలని ఆరాటం
ఎదురుచూసే పిల్లలు
కనపడక పోరాటం

మగువకు దూరం
మగతకు దూరం
లంచానికి దూరం
రోగాలకు దూరం

అబద్దాలు ఆడకు
ఆపద తెచ్చుకోకు
అతిగా మాట్లాడకు
నవ్వుల పాలు కాకు

అధికారముతో
అహంకారము
అజ్ఞానము తో
అంధకారము

తెల్ల కోటు సైనికులు
రోగాల కట్టడి కోసం
బార్డర్ లో సైనికులు
దేశ రక్షణ కోసం



–తాటిపాముల రమేష్
7981566031

## ఇది ఏమీ కాలమొచ్చేర

ఇది ఏమీ కాల మొచ్చేర మనుగడనే ప్రశ్నించెర
మనిషంటే ఎవరురా జ్ఞానానికి గుర్తురా
ఆ. జ్ఞానమే నేడు ఆగమయ్యింది రా
పురుగుతో గుట్ట గుట్టలు గ రాలేరా
ఇలాంటి కాలం ఎందుకు మనిషికి ఈనాటిదా ఈ పాపం కాదు
ప్రకృతికి మనం చేసిన ద్రోహం పగబట్టి మారెను అందుకే శాపం
ఏమిటి దీనికి మార్గం చేసెటి కర్తవ్యం
ఇపుడేమిటి మన భవితవ్యం ఏదీ వెలుగుల మార్గం ॥ఇది॥

విలువలు మరిచిన మనిషీ కాలం విలువను మరిచీ
పరహిత భావం వీడి ఆధిపత్యమే చేసీ
నాశనమన్నీ చేసాడు ప్రకృతి దాడి తొ పరుగెత్తాడు ॥ఇది॥

ఇప్పటికైనా మనిషీ చేసిన తప్పులు తెలిసీ
మంచిని ముంచే ముందు భవిబాధ్యత తొ మసిలీ
రక్షణ బాట లొ నడవాలి ప్రాణులకు తోడుండాలి ॥ఇది॥

వైద్యం విలువను తెలిసీ దేవుళ్లను భువికీ దించీ
హానిచేయడం మరిచీ మేలు గుణమును తెలిసీ
జరిగిన కీడు గుణపాఠము గా భవిభవితను రక్షించాలి ॥ఇది॥

జ్ఞానమొక్కటే జవాబు కాదు ప్రగతి మాత్రమే ప్రశ్నలుకావు
మానవత్వమే మనిషి మార్గ మై సర్వ ప్రాణులకు రక్షణగుండి
దివ్య గుణ ములూ చూపాలి ప్రకృతి లో ఒకరిగా మసలాలి ॥ఇది॥



-సిరిసిల్లా గఫుర్ శిక్షక్
9849062038

## భద్రత

ఇనుప పెట్టెల గదులు
ఊపిరి ఆడని చదువులు
మనోవికాసం లేని
మెకాలే చదువులు

మరచినాయి
శాస్త్ర సాంకేతిక వికాసాలు
భట్టి పెట్టిన చదువులు
అభివృద్ధికి ఆటంకాలు

శారీరక పుష్టినివ్వని
ఆటస్థలాలు
అడుగంటుతున్నాయి
పిల్లల స్వేచ్ఛ భావాలు

జరుగునా విద్యార్థుల
మానసిక,శారీరక వికాసాలు
వేయున భవిష్యత్తు బాటలు
కనిపించని ఆరోగ్య ఆనవాళ్లు.

–జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## బాలుడు దేవుడయ్యాడు..

పాటకు ఊపిరి ఆగింది.
పల్లవి ముక్కలై "ఒరిగింది"
చరణం చల్ల పడి"పోయింది"
రాగం రోదిస్తూ రోదసీ చేరింది.
వెండితెర దిక్కులు పెక్కటిల్లేలా
వెక్కి వెక్కి ఏడిస్తుంది.
గంధర్వం ఆవిరై గానం
విలవిలలాడుతుంది.
చలనచిత్ర రంగం కన్నీటి సంద్రమై
తెలుగునేల మూగపోయింది.
బాలుడు దివికేగి
తెలుగు వారి గుండెలో
దేవుడయ్యాడు.



–చందలూరి నారాయణరావు
9704437247

## రాత - గీత



### డబ్బు

ఉన్నవాడి పెళ్ళి ఊరేగుతున్నా
లేనివాడి శవం లేపలేకున్నా
అనుబంధాలు అడవి పాలవుతున్నా
కృత్రిమ కాగితాల కుతంత్రమే
మానవ మనుగడను
మట్టిపాలు చేసేది



### మాతృఘోష

చూరు నుండి
రాలుతున్నది
వానచుక్కా?
పల్లెతల్లి
కన్నీటి చుక్కా?
ఏమో?
మాతృఘోష
దేశానికి అరిష్టం.



రాత–శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత–వర్చస్వి

## బాల వికాసం

ప్రసిద్ధ బాలల రచయిత డా॥ వి.ఆర్.శర్మ కలం నుండిజాలువారిన ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల 'బాలవర్ధన్'. ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

## బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల
(ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)

8



మరుసటి రోజు బాలవర్ధన్ లేచే సరికి ఏడైంది. స్నానం, టిఫిన్ ముగించుకొని మరోసారి ఇల్లంతా తిరిగి చూశాడు. తనను తొట్లెలో వేసినచోట నిలబడి ఆనాటి సంఘటనను ఊహించుకున్నాడు. తన తల్లి ఆరోజు తన మెడలో వేసిన బంగారు గొలుసును తడిమి చూసుకున్నాడు. మెల్లెగా అడుగులు వేస్తూ, తలుపు దాటి వరండాలోకి వచ్చాడు. కాంపౌండ్ లోపల ఎడమ వైపున కొంత దూరంలో కనబడుతున్న ఇంటివైపు చూశాడు.

అది గతంలో ఔట్‌హౌజ్ అని, ఇప్పుడు అందులో డాక్టర్ రాజేశ్వర్ ఉంటున్నాడని, దానిలోనే ఆయన క్లినిక్ నడుపుకుంటున్నాడని, అతడు హెూమియో వైద్యడని, మంచి హస్తవాసి ఉన్నవాడని తాత చెప్పాడు. అతడు అమ్మకు క్లాస్‌మేట్ అని కూడా చెప్పాడు. కనుక, అతణ్ణి తప్పకుండా కలవాలి. అతనికి అమ్మ గురించి ఏమైనా తెలుసేమో కనుక్కోవాలి అనుకుంటూ అటువైపు నడిచాడు.

"వర్ధన్ బాబు, ఆగండి!" అంటూ వెనకనుంచి వచ్చాడు రాము. ఇద్దరూ ఆ ఇంటి ముందుకు వెళ్ళారు. డోర్ బయట చిన్న నేమ్‌బోర్డు 'డాక్టర్ రాజేశ్వర్ ,హెూమియో వైద్యులు.' అని కనిపించింది. తలుపులు తెరిచే వున్నాయి. బెల్ నొక్కాడు రాము. "ఆ వస్తున్నా, ఎవరూ?.." అంటూ వచ్చాడాయన.

"గుడ్మార్నింగ్ సర్! నా పేరు బాలవర్ధన్. నేను కులకర్ణిగారి మనుమణ్ణి. తను మా బ్రదర్ రాము" అంటూ తమను పరిచయం చేసుకున్నాడు బాలవర్ధన్.

"ఓ..నువ్వేనా! నీ గురించి మీ తాతయ్య చెప్పారు. లోపలికి రండి." అంటూ వాళ్ళను లోపలికి పిలిచాడు ఆడాక్టర్.

"అంకుల్! మీరూ మా అమ్మా క్లాస్‌మేట్స్ అని, ఇంటర్ వరకు కలిసి చదువుకున్నారని తాతయ్య చెప్పారు." అడిగాడు బాలవర్ధన్.

"ఔను. ఆ తరువాత నేను యంబిబియస్ చేయాలను కున్నాను. కానీ ఆ ఆర్థిక స్తోమత లేక, వైద్యంమీమ్మద నాకు ఉండే ఇష్టాన్ని వదులుకోలేక డిహెచ్‌యంస్ చేయడానికి గుల్బార్గా వెళ్ళాను. అందుకు అవసరమైన ఫీజు కూడా మీ తాతయ్యే ఇచ్చారు. నా చిన్నప్పుడే నాన్న చనిపోయారు. నేను ఇంటర్లో ఉండగా అమ్మ పోయింది. తరువాత చదువు ఆపేసి ఏదైనా పని చేసుకొని బతకాలని అనుకున్నాను. కానీ మీ తాతగారు నన్ను చేరదీసి, చదివించి ఈ స్థాయికి తెచ్చారు. రెండువేల ఏడు నుంచి ఇదే నా ఇల్లు, ఇదే నా క్లినిక్" చెప్పాడు రాజేశ్వర్.

"మీరు ఆయుర్వేద వైద్యం కూడా చేస్తారా అంకుల్?" అడిగాడు బాలవర్ధన్.

"లేదు. కేవలం హెూమియో వైద్యం మాత్రమే ప్రాక్టీస్ చేస్తున్నాను."

"మరి, మీరు తెమ్మన్నారని తాతయ్య జన్నారంనుంచి డాక్టర్ వెన్నెలగారి దగ్గర్నించి ఏవో ఆయుర్వేదం మందులు తెచ్చారు?!" సందేహాన్ని వెలిబుచ్చాడు బాలవర్ధన్.

"ఓ...అవా! వాటిని నాగ్‌పూర్ పంపాలి. అక్కడ నాకు తెలిసిన ఓ ప్రొఫెసర్ గారికి పంపించాలి. ఆయనకు ఆస్తమా ఉంది. ఆస్తమాకు హెూమియో లో మంచి మందులున్నాయి. నేను పంపిన మందులు వాడుకుంటే తనకు ఆస్తమా తగ్గుతున్నదని, మరో కోర్సు పంపమని ఫోన్ చేశాడు. వీటితో బాటు ఆయుర్వేద మందులు కూడా కలిపి వాడుతున్నాడు మాంధాత."

షాకేదో తగిలినట్టు ,మెరుపేదో మెరిసినట్టు..! చటుక్కున స్పందించాడు బాలవర్ధన్. "మాంధాతా...మాంధాత మీకు తెలుసా?!" బాలవర్ధన్ ఎంతో ఆత్రంగా అడిగాడు నమ్మలేనట్టు.

"ఔను, తెలుసు. మాంధాత నాకు ఈమధ్యనే పరిచయం అయ్యాడు. తను నీకు తెలుసా? ఎలాతెలుసు?

"మాంధాత అనే పేరు మాత్రమే తెలుసంకుల్. మీకు తెలిసిన మాంధాత, నాకు తెలిసిన మాంధాత ఒకరో కాదో కూడా నాకు తెలియదు".

"మాంధాత గురించి నీకు తెలిసిందేమిటి?"

"ఆ పేరు మా నాన్న డైరీలో నేను చూసాను. కానీ మా నాన్నకు డైరీ రాసే అలవాటే లేదట. ఆయిన దాన్ని అసలే వాడలేదు. కానీ ఒకే ఒక్క పేజీలో ఆ ఒక్కపేరే ఆయిన రాసారు. 'మాంధాత, మహరాష్ట్ర' అని మాత్రమే రాసారు. అదీ, తాను మా అమ్మను వెతకడానికి వెళ్ళేముందు రాసారు, అక్టోబర్ నెలలో. ఆ మాంధాత ఎవరో ఎవరూ చెప్పలేక పోయారు. నేను గూగుల్లో వెతికితే ఒక్క ముంబాయి లోనే అనేక మంది ఆపేరుతోఉన్నారు".

"నిజమా?, అది చాలా తక్కువమందికి ఉండే పేరు కదా!" తల పంకిస్తూ అన్నాడు రాజేశ్వర్.

"అది, మానాన్న అమ్మను వెతుకుతానని వెళ్ళిన రోజుకంటే ఒక్క రోజు ముందు రాసింది. ఆ తేది పేజీలోనే ఎందుకు రాసాడో...మానాన్న కనిపించక పోవడానికీ, మాంధాతకూ ఏదో సంబంధం ఉందని నాకు అనిపిస్తోందంకుల్! "

"నిజమే, ఓ సంబంధం ఉంది! కానీ అది మరోలా ఉంది. అందుకు మాంధాత కారణం కాదు" తల అడ్డంగా ఆడిస్తూ చెప్పాడు రాజేశ్వర్. "ఐతే, మీ నాన్న మీ అమ్మను వెతుకుతూ వెళ్ళి ఈ మాంధాతను కలిసాడు" అన్నాడు మళ్ళీ.

"ఔనా, నిజంగానా?!" నమ్మలేనట్టు చూసాడు బాలవర్ధన్. తన గుండె వేగంగా కొట్టుకోవడం తనకు తెలుస్తోంది.

"మాంధాత అనే పేరు పట్టుకొని బాగానే ఆలోచిస్తున్నావు వర్ధన్! మాంధాత గురించి తెలిస్తే మీ నాన్న గురించి మరేమైనా తెలియొచ్చుననే నీ ఆలోచన నిజమే. ఈ మాంధాతనే మీ నాన్న కలిశాడు. కలిసి మాట్లాడాడు."

రాజేశ్వర్ మాటలు ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న వాడికి పడవ దొరికినట్టు వినిపించాయి బాలవర్ధన్‌కు. రాముకూడా ఆశ్చర్యపోతూ "నిజమా సార్!" అంటూ కళ్ళు పెద్దవి చేసుకొని చూస్తూ నిలబడ్డాడు.

"ఔను, ఈవిషయాలు నాకు మాంధాతనే చెప్పాడు. తనే ఓ రోజు నాకు ఫోన్‌చేసి చెప్పాడు. అంతవరకు ఆయన ఎవరో నాకు తెలియదు. ఆయనకు ఆస్తమా సమస్య చాలా కాలంగా ఇబ్బంది పెడుతున్నదట. అనుకోకుండా ఓరోజు టీవీలో నా ఇంటర్వ్యూ చూశాడట. స్క్రీన్ మీద వచ్చిన నా ఫోన్ నంబర్ నోట్ చేసుకుని తరువాత నాకు ఫోన్ చేశాడు. ఆ రోజు ఆ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ వెన్నెల కూడా ఉన్నారు. ఆమెతో కూడా మాట్లాడానని చెప్పాడు. తన అనారోగ్య సమస్య గురించి చెప్పి, మందులు పంపించమని అడిగాడు. డబ్బులు అకౌంటుకు పంపిస్తానని చెప్పాడు. ఆ సందర్భంగా తనను పరిచయం చేసుకుంటున్నప్పుడు నాది ఆదిలాబాద్ అని చెప్పగానే, మీ నాన్న విషయం తనకు అనుకోకుండా గుర్తుకు వచ్చిందని చెప్పాడు."



"ఆయనను మానాన్న కలిశాడా? ఎందుకు, ఎక్కడ కలిశాడట? చెప్పాడా అంకుల్ ?" బాలవర్ధన్ ఆత్రత తట్టుకోలేక పోతున్నాడు.

"మాంధాత నాగ్‌పూర్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరయ్యాడు. అతని తల్లిదండ్రులు తెలుగు వాళ్ళు. ఎన్నో ఏళ్ళకిందట వ్యాపారం కోసం అక్కడికి వలస వెళ్ళారు. మాంధాతను మీ నాన్న కలిసిన కాలంలో ఆయన యూనివర్సిటీలో ఉద్యోగం చేస్తున్నారు. ఆకాలంలో వింధ్యా, సాత్పూరా పర్వతాల మధ్య విస్తరించి వున్న "పాతాళ్ కోట్ ప్రాంతంలో నివసించే ఆదివాసుల ప్రాచీన కథలు, విశ్వాసాలు" అనే అంశంమీమ్మద ఆయిన పరిశోధన చేశాడు. ఆ విషయంమీమ్మద ఆయిన రాసిన ఓ ఆర్టికల్ అప్పటి పత్రికలో వచ్చిందట. దాన్ని చదివిన మీ నాన్న మాంధాతను కలిసి 'మాయ' ను గురించి అడిగాడట. తన భార్య మాయమైన విషయం చెప్పి, మాయ అనే వాడు నిజంగానే ఎవడైనా ఉన్నాడా? తన భార్య కనిపించకుండా పోవడానికీ మాయకు ఏమైనా సంబంధం ఉండే అవకాశం ఉందా?' అని అడిగాడట." రాజేశ్వర్ చెప్పడం ఆపి, లేచి మంచినీళ్ళు తాగివచ్చి మళ్ళీ చెప్పడం కొనసాగించాడు.

"మాంధాత 'మాయ' గురించి తనకు తెలిసిన విషయాలు చెప్పాడట. 'వాటిలో అధిక భాగం ప్రచారంలో ఉన్న కట్టుకథలేనని, కానీ కొందరు అవన్నీ నిజమేనని ధృఢంగా విశ్వసిస్తారని' చెప్పాడట.

'మాయ ఎక్కడుంటాడని ఆదివాసులు నమ్ముతారని' మీ నాన్న మాంధాతను అడిగాడట. 'పాతాళ లోకంలో ఉంటాడని కొందరి నమ్మకం' అని అతడు చెప్పాడట. పాతాళ్ కోట్ నుంచి ఆ పాతాళానికి మార్గం ఉందని చెప్పుకుంటారని' చెప్పాడట. అలాంటి మరికొన్ని వివరాలు అడిగి, థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడట. భోజనం చేసి వెళ్ళమని ఎంత అడిగినా వద్దని వెళ్ళిపోయాడట.

నాది ఆదిలాబాద్ అని తెలిసి, ఈ విషయాలు గుర్తుకు వచ్చి చెప్తున్నానని చెప్పాడు. మీ అమ్మా నాన్నా తెలుసా అని అడుగాడు. బాగా తెలుసునని, ప్రస్తుతం వాళ్ళ ఇంట్లోనే ఉంటున్నానని నేను చెప్తే, "వాళ్ళు దొరికారా? తిరిగి వచ్చారా?" అని అడిగాడు. ఓసారి నాగ్‌పూర్ చూడ్డానికి రమ్మని పిలిచాడు."

"అంకుల్! ఆయన ఫోన్ నెంబర్ ఇస్తారా?" అంటూ బాలవర్ధన్ ఆ నెంబర్ ఫీడ్ చేసుకోవడానికి తన జేబులోంచి తన ఫోన్ తీసాడు. రాజేశ్వర్ చెప్పిన నెంబర్ ఫీడ్‌చేసుకొని, వెంటనే ఆనెంబర్‌కు కాల్ చేశాడు. రెండుసార్లు రింగయిన తరువాత "హలో!" అని వినిపించింది.

"సర్! నాపేరు బాలవర్ధన్. నేను ఆదిలాబాద్ నుంచి డాక్టర్ రాజేశ్వర్ గారి ఇంటినుంచి మాట్లాడుతున్నాను. మీరు బిజీగా ఉన్నారా? లేకపోతే రెండు నిమిషాలు మాట్లాడొచ్చా?!" పర్మిషన్ కోసం అడిగాడు. ఫరవాలేదు మాట్లాడొచ్చు" అన్నాడు మాంధాత అటు వైపునుంచి. రాజేశ్వర్ , రాము ఈ సందర్భాన్ని ఊహించలేదు. ఐనా నిశ్శబ్దంగా చూస్తూ ఉండిపోయారు.

"అంకుల్! నాపేరు బాలవర్ధన్. సుమారు పదిహే నేళ్ళ క్రితం ఇక్కడ్నుంచి వచ్చి, మిమ్మల్ని కలిసిన కార్యవర్ధన్ కొడుకుని" పరిచయం చేసుకున్నాడు బాలవర్ధన్.

"ఓ...వెరీ నైస్! డాక్టర్‌గారున్నారా అక్కడే?"

"ఉన్నారంకుల్, మాట్లాడుతారా?"

"ఫరవాలేదు. ముందునువ్వు మాట్లాడు. ఎందుకు ఫోన్ చేశావో చెప్పు?" అన్నాడు మాంధాత.

"మిమ్మల్ని పర్సనల్‌గా కలవాలంకుల్. మా అమ్మానాన్నల అదృశ్యం గురించి. మీతో మాట్లాడితే ప్రయోజనం ఉంటుందని నాకెందుకో బలంగా అనిపిస్తోంది. మీరు అనుమతిస్తే రేపు ఉదయం కల్లా వచ్చేస్తాను."

" ఫోన్‌లో మాట్లాడొచ్చు కదా?"

"లేదంకుల్. మిమ్మల్ని ఓసారి కలవాలి. మీకు ఇబ్బంది లేకపోతే నేనే వస్తాను. ప్లీజ్ అంకుల్! మీ మందులు కూడా నేనే తెస్తాను" బాలవర్ధన్ ఎంతో ప్రాధేయ పడుతున్నట్టు మాంధాతకు అర్థమైంది.

"సరే! నాకేమీ ఇబ్బంది లేదు. ఎలా వస్తావో చెప్తే పికప్ చేసుకుంటాను. పెద్దవాళ్లను ఎవరినైనా తోడు తెచ్చుకో. ఫోన్ డాక్టర్‌గారికి ఇవ్వు" చెప్పాడు మాంధాత. "హలో, ప్రొఫెసర్జీ! ఎలా ఉన్నారు?" అంటూ ప్రారంభించి, మందులు వేసుకోవడం గురించీ, బాలవర్ధన్ గురించీ కాసేపు మాట్లాడుకున్నారు. బాలవర్ధన్ నిజంగానే వస్తే అతనితో మందులు పంపుతానని, లేకపోతే పోస్టులో పంపుతానని చెప్పి ఫోన్ పెట్టేశాడు రాజేశ్వర్.

తరువాత బాలవర్ధన్‌ను చూస్తూ "ఏం వర్ధన్ బాబూ! నిజంగానే నాగ్‌పూర్ వెళ్దామనుకుంటు న్నావా?" అని అడిగాడు.

"మా అమ్మానాన్నల అదృశ్యం గురించి ఏదైనా చిన్న ఆధారం అక్కడ దొరకొచ్చునని ఎందుకో నాకు అనిపిస్తోంది అంకుల్. ఏమైనా సరే, నేను మాంధాత గారిని కలవాలి. ఈ రోజు బయల్దేరితే రేపు ఉదయంకల్లా నాగ్‌పూర్ చేరొచ్చా?"

"చేరొచ్చు. సుమారు మూడు వందల కిలోమీటర్ల దూరం ఉంటుంది. ట్రెయిన్ రిజర్వేషన్ దొరకడం సాధ్యం కాకపోవచ్చు. ఏసీ లగ్జరీ నాన్‌స్టాప్ బస్సులు ఉంటాయి. వాటిలో వెళ్ళొచ్చు. కానీ ముందు మీ తాతయ్య గారిని అడగాలి కదా?" అన్నాడు రాజేశ్వర్.

"అడుగుతానంకుల్. ఇప్పుడే మా తాతయ్యతో మాట్లాడుతాను. రామన్నా, పద తాతతో మాట్లాడుదాం!" అని బయటకు నడుస్తూ, "థాంక్స్ అంకుల్! మీరు చాలా హెల్ప్ చేశారు"అంటూ నమస్కరించాడు. రాము అతణ్ణి అనురించాడు.

(సశేషం..)



–డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

## గాన కర్ణుడు



పల్లవించిన పాటను అజరామరంచేసి
తాను మౌనంగా వెడలిన గాన యోగి!

గాత్ర క్షేత్రంలో" ఒకే చెట్టు ఆరురకాల
పూవుల్లా"...ఒకే గళం షణ్ముఖ శబ్ధ ఖేలనం!

యుగళగీతాలు యువత ప్రేమ వాహకాలు
భక్తి గీతాలు భగవన్నామ ద్వారాలు!
వెండితెరకు కన్యకు బంగారు జరీ కడతాయి
బాలూ పాటలు!

భాషామతల్లి అతనిపాటలనగలో
ముత్యమై మెరిసినట్టు రత్నమై అలరినట్టు
"శంకరాభరణా"లంకారంతో...రంజిల్లుతుంది!

బాలు చెక్కిన నలభైవేల రాగశిల్పాలను
మన వీనులు ఎల్లప్పుడూ కొలుస్తునే ఉంటాయి గుండె
గదినే గుడి చేసుకొని!

తారలకు గాత్రదానంచేసే "గానకర్ణుడు "
సుబ్రహమణ్యుడు!
విపంచిని కంఠ నాళాలలో అమర్చి
పుట్టించిన విరించికి శతకోటి నమస్సులు!

ప్రభాతం అతని పాటకు ఎదురు చూస్తుంది
భూపాళం అతనికంఠాన్ని స్పృశించక పోతే
నశించి పోతానేమో అని బెంగపడుతుంది!

దేవాలయ శిఖరాలు గాన పుష్పవర్షం
ఎప్పుడు కురుస్తుందా అనిఎదురు చూస్తాయి!

స్థవాలకు అలవాటు పడిన దేవతలు
ఆగాన ఝరిలో స్నానించక పోతే
నిద్ర పట్టరు...నిద్రలేవరు!

ఎన్ని రాయబారాలు నడిపిందో ఆ పాట
ఎన్ని హృదయాలకు స్వస్థత
చేకూర్చిందో ఆ గానం!
ఎన్నెన్ని మరణాలను నిస్పృహాలోయల్లోకి
జారకుండా నిలువరింప జేసిందో
ఆ సం"గీతం"!

బహు భాషల గీతికలను
జాతీయ స్థాయి అవార్డులు పుష్పగుచ్ఛాలతో
అభినందించాయి!
ఈశ్వరానుగ్రహంతో స్వర్ణ నందులు
ఇంటికి నడచి వచ్చాయి!

ఒక్కడై రావడం ఒక్కడై పోవడం
అంటూ విషాదం నిశీథిలోకి నెట్టినా
కైలాస గిరినుండి వెన్నెల వెలుగులు
మాపై ప్రసరిస్తునే ఉంటాయలే!
మీ పాటల మాకెపుడూ
కరదీపికలౌతాయి
స్వరదీపికలౌతాయి!



–కిలపర్తి దాలినాయుడు
7780589336

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
గురువారం 22-10-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

## నమ్మలేని నిజాలు

వజ్రనగరం
మెరుపు మరకలు
కీర్తికి చీడ

బురద కూపం
పాపాలు తలాకొంత
నగరం నేడు

నాలాలు మాయం
రోడ్లపై పడవలు
ఆశ దురాశ

ఆర్థిక ఊతం
అందని చందమామ
చెవికి ఇంపు

ఆర్థిక నష్టం
చైనా దిగుమతులు
స్వయం సంవృద్ధి



- రేడియమ్
సెల్: 9291527757

## శ్రీనిజాలు

నమ్మించి మోసపుచ్చే
చలాకీ వాన ఇగురం !
సునామీలా ఊడ్చేసె
హైదరాబాదు నగరం !

మన్ను కొట్టె నోటినిండ
మనుషుల్నీ వంచేసె !
కాని కాలంలా వాన
జీవితాల్ని ముంచేసె !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

పుస్తక సమీక్ష

# "కలవ కొలను" రమణీయ భావ కుసుమాలు..






'భావకవితా మహతి' శ్రీ వారణాసి వెంకట్రావుగారి గేయ సాహిత్యానికి పద్యానువాదం చేస్తూ.. కలువకొలను సూర్యనారాయణగారు "భావ సుమవనం' పేరుతో ఓ కావ్యాన్ని వెలువరించారు. పద్య రచనలో సిద్ధహస్తులైన కలవకొలను సూర్యనారాయణగారు వెంకట్రావుగారి గేయలహరిలోని రచనలను రమణీయంగా ఏమాత్రం భావ గరిమ జారనీయకుండా పద్యానువాదం చేసి మెప్పించారు. ఈ కావ్యంలోని 63 కవితా కుసుమాలు.. వెంకట్రావుగారి పాటకు పట్టంకట్టేలా రూపుదిద్దుకుని అందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయి. వెంకట్రావుగారి గేయాల్లోని ప్రకృతి సౌందర్యాన్ని, సూర్యచంద్రులను, నక్షత్ర కాంతులను, మాతృభక్తి, గురుభక్తి, దేశభక్తి, దైవభక్తి, తదితర అంశాలను మూలం దెబ్బ తినకుండా సూర్యనారాయణగారు పద్యాలుగా మలిచారు. పాటపద్యమైన వేల..పొందే అనుభూతిని ఆస్వాదించే విధంగా సూర్యనారాయణగారు తీసుకున్న శ్రద్ధ శ్లాఘనీయం.

**ఏడు స్వరాలతో నెన్నియోగాల**
**సరసమ్ముగా పాడు జాణవమ్మ!**
**వాణి కరాలకే వరభూషణంబవై**
**వెలిగెదొ మెలగెదో! వేల్పుటమ్మ!**

అంటూ మధురవీణ గేయాన్ని పద్యరూపంలో మనకు సూర్యనారాయణ గారందించారు.

నూతన వత్సర శుభ సమయాన
శ్రోతలకిదే మా స్వాగతం అంటూ వెంకట్రావుగారు రాసిన 'ఆమని కాహ్వానం' గేయానికి సూర్యనారాయణగారు పద్యాలనిలా అల్లారు.

**ఆమని వచ్చినంతనే ప్రహర్షమునన్ దగ పాడిపాడినీ**
**కోమల గాత్రమే అలసి కొందల మంది విరామకాంక్ష నీ**
**ధామము చేరి నావొకా! పదం పడి దార్ఢ్యము.. సంతరించనీ**
**లేమికి తాపమొందితిమిలే, పికమా! నవగాన శోభితా**

అంటూ 'వసంత కోకిల' శీర్షికతో మొదటి పద్యాన్ని రాశారు.

వెంకట్రావుగారు 'పలవరింత' శీర్షికతో రాసిన గేయంలో అందమైన భావాలను అక్షరాల్లో బంధించారు.

**మ్రోగింపని వీణలో**
**మూగవోయి రాగాలెన్నో దాగియున్నవీ**
**దాగి యున్నవి**
**పలకరించే హృదయముంటే**
**పరవశించే పాడుదామని**
**ఎన్ని నాళ్ళనుండో ఎదురు చూస్తున్నది.**
**శ్రుతి సుధలను త్రావిన తనకు**
**ఎల్లప్పుడు యౌవనమేనని**
**రాగాలను పలికించే రాజెపుడో వస్తాడనుచు**
**కల తెరుగని నిద్దురలో కలలు గంటున్నది**
**చందమామ రాకకై సాగరమే చూచినటుల**
**నీలి మబ్బు నీకై నెమలి వేచియున్నటుల**
**పలికించే హృదయం కొరకు పరవరించిపోతున్నది"**

అని వెంకట్రావుగారు రాస్తే.. దీన్ని సూర్యనారాయణ గారు 'ఎదురుచూపు' శీర్షికతో పద్యంగా ఇలా తీర్చిదిద్దారు.

**"శ్రుతి సుధలెన్నో పంచితిని శ్రోతలు సంస్తుతిజేయ, నేడిటుల్**
**వెతలను పొందుచుంటి, నను ప్రీతిని మీటెడి నాధుగానకన్**
**సతతము యౌవనంబెగల సంస్తవనీయను, మేటి సంద్రమే**
**గతి శశిరాక గోరు తమకంబున, నట్టువ పిట్టయే విధిన్**
**వ్రతముగ నెంచి సత్పథము బాయక జూచునొ నల్లమబ్బుకై**
**అతులిత కాంక్షనేనటుల ఆతృత నంచని వీణపల్కెడెన్"** అంటూ పద్యం రాశారు.

ఇలా తల్లీ గోదావరీ! ఊహా సుందరి, పూలపిలుపు, చెక్కిట చుక్క, మిసిడిపడకు, కలువ విలాపం, మధుమాసం, చైత్రవిచిత్రం, ఆమని అతిథి, మల్లె మనసు, నిదుర, మనసా విను, పున్నమివెన్నెల, ప్రేయసి, నెరజాణ, ప్రకృతి పులకింత, ముద్దుకి హద్దు, అమ్మలేని ఆర్తి, కళ్యాణ వైభోగం, వెలుగు వేల్పు మొదలగు గేయాలను వెంకట్రావుగారి 'వసంత వల్లరి', 'గేయ నికుంజం', 'కోయిల వాలిన కొమ్మ' మరియు 'పూజా పుష్పాలు' మూల గ్రంథాల నుంచి సేకరించి సూర్యనారాయణగారు పద్యాలుగా మలిచారు.

పాటను పద్యంగా మలిచి..పాటకు మరింత గౌరవాన్ని పెంచారు. ఈ సందర్భంగా 'భావకవితా మహతి' శ్రీ వారణాసి వెంకట్రావుగారికి, కలవకొలను సూర్యనారాయణగారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం.

అందమైన ముఖ చిత్రంతో కొలువుదీరిన ఈ పుస్తకంలో ప్రతిపద్యం ప్రక్కన..మూలగేయాన్ని పొందుపరిచి నిండు శోభను కూర్చారు. 'కలవ కొలను' గారి కలం నుండి జాలువారిన ఈ రమణీయ భావ కుసుమాల్లోని సుగంధాలను ఆస్వాదిద్దాం.

**ప్రతులకు:** వారణసి వెంకట్రావు
డో.నెం. 73-31-1-4/1
రఘు గార్డెన్స్, కరివేపాకుతోట సందు
విజయవాడ-520 007
సెల్: 92481 62045



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544





## జలమయమైన హైదరాబాదు

సీ.మా.ప్రకృతి వికటించి ప్రళయాన్ని సృష్టించి
భాగ్య నగరమెల్ల పారెనీరు
కుండపోతగ వాన కురువగా నగరము
జలమయంబై చుట్టె నిలయములను
దారులన్నియు వరదలుయయ్యి పారగ
స్తంభించె జనవాహనంబులన్ని
నిలయంబులెల్లను నీటితో నిండగ
నింటినుండియు బయట కెళ్ళలేక
నింటనేయుండియు నిబ్బంధి పాలైరి
కరుణలేనివరుణు కారణమమున
వాహనంబులు పారు వరదలో నుండగా
కంటియెదుట నీట కలిసిపోయె

తే.గీ.చుట్టు భవనాలు కట్టగ కట్టుబడెను
చెరువు భాగాన నిండ్లన్ని చేరిపోయె
దారి లేకయే నగరాన చేరెనీరు
కాలొనీలెల్ల నీటితో కట్టబడెను.



-ఎలగందుల లింబాద్రి
7659834393

## నగర నిర్వేదం

నగరమంటే
కొత్త నిర్వచనాలు వెతకాలిప్పుడు.....!
నగరమంటే
ఏరులైపారే కన్నీటివరద....
నగరం
ఎంత తోడిపోసినా వొడువని
కన్నీళ్ళ వలపోత....
మునిగి పోయిన
ఇసిరెలు చూసి ఏడవడం కాదు....
నిండా మునిగిన బతుకులను
అద్దద్దుల బట్టి తెచ్చే
పాతాళ గరిగెలు కావాలిప్పుడు....
కొట్టుకుపోతున్న భవిష్యత్తును
గట్టుకుచేర్చే సారథి కావాలిప్పుడు.....
నగరమెందుకు
ఒంటరిదయిందో
చెప్పగలిగిన 'కాలజ్ఞాని' కావాలిప్పుడు....
సౌందర్యలేపనాలతో
మభ్యపెట్టడంకాదు....
సహజ గాంభీర్యాన్ని కోల్పోయిన
నగరాన్ని వెతికి తీసుకురావాలిప్పుడు....
విలాసాలతో విలసిల్లే నగరం
విలాపాలకుగల
'నగ్న సత్యాలు' కావాలిప్పుడు...
నగరం గుండెమీద
'మెట్రోపాలిటన్' పచ్చబొట్టును
వికృతంగా మార్చిందెవరో
కనిపెట్టాలిప్పుడు.......

-డాక్టర్ మడత భాస్కర్
8919328582

## సంధ్య లోతుల్లోంచి...

సరిగమలు పలికినట్టు
కలికి సింగారాన్ని ఒడిసిపట్టుకుని
నవమి చంద్రుడు లేచి నడుస్తున్నాడు
మధురమైన శరత్కాలంలో
పుడమిపై సకల జీవరాసులు
తనివితీరా పండు వెన్నెలల్ని
పిండుకుని ఆస్వాదిస్తుండగా
మేఘాల చాటునుంచి నిక్కి చూస్తూ
తలత్తలల వైభవ రాజంతో
తెలుగువాడి పంచెకట్టు సోయగంలా
విను వీధిలో ఆనంద యాత్ర చేస్తున్నాడు చందమామ...

గూళ్లలో పక్షుల కిచకిచలు
కొట్టంలో పాడియావుల నెమరువేతలు
గొర్రెల మంద కాపలదారు ని అదలింపులు
దూరముగా పట్టాలపైదూసుకొచ్చే
రైలు కూత
ఒంటరి స్మశానంలో
దహన మవుతున్న కాడు చప్పుళ్ళు
ఊరికి ఉత్తరాన
నిశ్చల చెరువు నీటీలో
చేప పిల్లల ఒయ్యారాలు

సకల సంపత్తిమీద
ప్రతిఫలిస్తున్నాడు శశి...

సంధ్య లోతుల్లోంచి
నడినెత్తిపైకెగసి ముచ్చటగా
దరహాసాలతో మురిపిస్తుంది
శరశ్చ ద్రుని తేజో రజ విలాసం!!



-దామెర రాములు
9866422494

## 7డుపు

వర్షం తలమించి జారిపడుతుంటే
7డుపు ఒడలంతా పాకురే !
వంతెన లేదు
రోడ్డు లేదు
ఇంటింటికి ఏది దారి
గోదారే --
ఈతకు "లాగిన్" కావాలి
ఏరులు దారి తప్పినట్లు
నగర సంచారం !
మానవ సంచారం బంద్
నేలకు కి మీ ఎత్తునే మబ్బులు
వరద ఎత్తుకు పై ఎత్తు
ఎందుకు కాదు !
గృహం దాటి బయట పడకండి
కరోనా కాదు ---
నీరు కాటు వేస్తుంది
నీటి కాటుకు మందు లేదు
మునుగుడు తేలుడు !
వరుణుడు అందరి ఇంట్లో తిష్ఠ
జబర్ దస్తీ -
దస్తి కూడా ఆరలే!
ఆకాశం మాయమైపోతే బాగుండు
వరద గురించి ఏం రాస్తాం ?
కలం సిరా నీరు నీరు !
కాగితం ముద్ద ముద్ద !
7డ్పు ఒకటే మనకు మనకు
మనం మనంగా !



- కందాలై రాఘవాచార్య
8790593638

పుస్తక సమీక్ష

# ఆర్ద్రత చిప్పిల్లిన కవిత్వం






మొవ్వ రామకృష్ణ వంద కవితలతో 'అమ్మ అమృత హస్తాలు' పేరిట శత కవితా సంకలనం ఆవిష్కరించాడు. దాదాపు అన్ని కవితలు ఒకే సంవత్సరంలో 2018లో రాసినవే.

కవితలన్నీ చదివింతర్వాత ఈ కవికి అమ్మ అంటే ఎంత యిష్టమో, ఆమె అమృత హస్త స్పర్శ కోసం ఎంతగా పలువరిస్తాడో అర్థమవుతుంది. అలాగే నాన్నంటే కూడా.

కన్న తల్లిదండ్రుల్ని వృద్ధాప్యంలో నిర్లక్ష్యానికి గురి చేస్తు వృద్ధాశ్రమాల్లో ఒదిలేస్తున్న కొడుకులపై అలవి కాని ఆక్రోశం.. ఆగ్రహం. అనేక కవితల్లో ఆగ్రహజ్వాలల్తో అక్షరాలను ఎరుపెక్కిస్తాడు. ఆర్ధ్రతతో గుండెను బరువెక్కించే పంక్తులు అక్కడక్కడా లేకపోలేదు.

**"నీ ముక్కు మూతి తుడిసి**
**నీ ముడ్డి కడిగి**
**వెన్నెల్లో గోరుముద్దలు తినిపించిన**
**అమ్మ చేతులు**
**ఎంత పవిత్రమైనవో?"** అందుకే అమ్మవి అమృతహ స్తాలు.

**"అమ్మ.. నిన్ను లోకానికి**
**పరిచయం చేసిన దేవత"**
**మరి నాన్న;**
**"నాన్న.. నీకు లోకాన్ని**
**పరిచయం చేసిన దేవుడు"**

దైవ సమానులైన తల్లిదండ్రులకు ప్రత్యామ్నాయం లేదంటున్న ఈ కవి వృద్ధాప్యంలో వారిని నిర్లక్ష్యం చేయవద్దని వేడుకుంటున్నాడు.

**"నీ ముడ్డి కడిగి.. నీకు గోరుముద్దలు తినిపించిన**
**ఆ ముసలి చేతులు**
**రోగమొచ్చి వాలిపోయినవి**
**నీ అవ్వ.. నీ అయ్య**
**నీ కోసం.. దిక్కులేని పచ్చులోలె**
**అలమటిస్తున్నారు**
**కొడకా.. నా కొడకా అంటు**
**నీ రాక కోసరమే బిడ్డా?**
**ఆ చివరి.. సూపు కోసమే..'**

గుండె పిండేసినట్టుంది కదూ? అమ్మ స్పర్శ కోసం యింతగా పరితపించే మువ్వ రామకృష్ణ ఏడు రోజుల పసిగుడ్డుగా వున్నప్పుడే తల్లిని పోగొట్టుకున్న దురదృష్టవంతుడు. అందుకే కవిలో యింతటి ఆవేదన.

వస్తువు, సేవలమీద కేంద్ర ప్రభుత్వ పన్ను విధానం (జిఎస్‌టి)పై కవి స్పందన చూడండి.

**త్రాగితే పన్ను.. తింటే పన్ను**
**అరగక ఆసుపత్రి కెళ్తే**
**పన్ను పీకి... చేతిలో**
**పెట్టిన, పన్నుపై పన్నురా!**
**ఎక్కడ చూసినా.. జీఎస్‌టి లొల్లి**
**బారు షాపులో.. చివరికి బార్బర్ షాపులో**
**దోబీ ఘాట్‌లో కూడా జీఎస్‌టీ**
**బాదుడేనా?"** అని నివ్వెరపోతున్నాడు.

**ఎన్ని జన్మలైనా**
**మళ్ళీ రైతుగానే పుట్టాలని**
**ఈ పంచ భూతాల సాక్షిగా**
**సత్య ప్రమాణం చేస్తున్నాను"** అంటు తన నేపథ్యాన్ని చాటుకుంటున్న రామకృష్ణ జంతు ప్రేమికుడు. పెంపుడు కుక్కలు, వీధి కుక్కల మధ్య మనుషులు చూపుతున్న వ్యత్యాసానికి చలించిపోతాడు. నిజానికి అవీ, యివి అన్నీ కుక్కలేగా? అందుకే

**"మున్సిపాలిటీ వాళ్లకు**
**అప్పగించొద్దని**
**మిమ్ములను ప్రార్థిస్తున్నాము"** అంటు వాటి తరఫున వేడుకుంటున్నాడు. మరో కవితలో తమాషాగా **"మరెందుకో.. ఈ రోజు తెల్లారినా కోడి కూయటంలా? కూస్తే? గెలిచిన రాజకీయ నాయకుడు కోస్తాడేమోనని దాని భయం"** అంటు చమత్కరిస్తాడు.

**"చివరికి ఎవరి గొప్పలైనా**
**శ్మశానం వరకే**
**చితికి నిప్పింటించే వరకే"** వంటి తాత్వికత గూడ కొన్ని పంక్తుల్లో గమనించవచ్చు. ఈయన కవితల్లో కవిత్వాంశ కన్నా ఉరకలెత్తే ఉత్సాహం కొట్టొచ్చినట్టు గోచరిస్తుంది. అందుకేనేమో.. మొవ్వ నిజాయితీగా ఒప్పుకుంటున్నాడు.

**"నేను నిజంగా.. కవిని కాను**
**స్వచ్ఛమైన.. నా హృదయంలో**
**ఎన్నెన్నో.. భావాలు**
**వాటిని..నేను నాకు వచ్చిన భాషలో, భావంతో**
**అక్షరమాల కడతాను.**
**అదే.. నా కమ్మటి కవితైపోతుంది.**
**కవిత చదివిన పాఠకులు**
**నన్ను తిడుతున్నారో.. పొగడుతున్నారో**
**అర్థం చేసుకునే లౌక్యం, నేర్పు**
**నాకు లేదుసుమా!"** అంటున్న ఈ కవికిది తొలి ప్రయత్నం.

డా|| రామాచంద్రమౌళి తన పీఠికలో అభిప్రాయ పడినట్లు.. రామకృష్ణ కవిత్వ వస్తువు ఎంపికపై యింకాస్త జాగ్రత్త తీసుకుని కవిత్వీకరణ నైపుణ్యాన్ని సాధించవలసి వుంది. ప్రతి కవితనూ ప్రతిభతో, నైపుణ్యంతో శిల్పంలా చెక్కాలి. ఈ శిల్పీకరణ విద్యను ఈ కవి ఇంకా సాధన చేయవలసి వుంది.

పై సలహాలను పాటిస్తు తన కవితా ప్రస్థానం రామకృష్ణ కొనసాగిస్తాడని నా నమ్మకం.

ప్రతులకు:మొవ్వ రామకృష్ణ
ప్లాట్ నెం.4, గురుద్వార్ రోడ్
వనస్థలిపురం, హైదరాబాద్-70
సెల్: 9177423777



- రమణ వెలమకన్ని
సెల్: 9866015040










## ఈ పాపం ఎవ్వరిది ?

ఆగక కురుస్తున్న వాన నీరు
ఏరులై సాగుతున్న మురుగు
కట్టలు తెంచుక పొంగి వచ్చే వరద
కలిసిపోయి కాపురాలను
ఖాళీ చేయించి ఇళ్లలో తిష్టవేశాయి
రాదారులన్నీ గోదారులై
పడవలే రవాణా సాధనాలయ్యాయి
పొట్టకూటికోసం పట్టణానికి
వలస వచ్చిన నిర్భాగ్యులు
'అభాగ్యనగరం' మురికి వాడల్లో
పేకమేడల్లాంటి ఇరుకు ఇళ్ళల్లో
తలదాచుకుని కూలీనాలీతో
బిక్కుతు బ్రతుకీడుస్తుంటే
పాడు వరదలకు కొట్టుకు పోతూ
గూడులేని పక్షులయ్యారు
పదో పరకో కడుపు మాడ్చి
కూడబెట్టుకుని వడ్డీల బేడిల
అప్పుతో కొన్న అల్పాదాయ జనాల
ఆవాసాలు నిండా నీటమునిగి
దిక్కులేక పునరావాస కేంద్రాలలో
తలదాచుకుంటున్న దుఃఖస్థితి
స్వార్థం నిండిన ఆసాములు
చెరువులను, కుంటలను
కబ్జాచేసి లోతట్టు జాగాల్లో కట్టిన
అపార్టుమెంట్లు జలసంద్రాలైనందుకు
ఆశగా కొని నివసించే అమాయకులు
ఘొల్లుమంటూ విలపిస్తున్నారు
కాంక్రీట్ జనారణ్యంలో
కనిపించని కన్నీరులాగే
కురిసిన వాన చుక్కలకు
నేల ఒడి కరువై ధారలుగా
కాలువలుగా, వరదలుగా సాగి
నోళ్ళు తెరచుకున్న మాన్ హోల్ లలోకి
ఆడుకునే పసి పిల్లల్ని
ఆదమరచిన అభాగ్యుల్ని లాగి
అన్యాయంగా మింగేస్తున్నాయి
పల్లమెరిగిన నీరు దారిలేక
కోట్లు పెట్టి కొన్న విల్లాలను
పూరి గుడిసెలనూ నింపేశాయి
మనిషి తానే అధికుడినని విర్రవీగుతూ
నీడనిచ్చి బ్రతుకునిచ్చిన
పుడమితల్లిని తూట్లు పొడిచి
జీవ ధాతువులను
ప్రాణాధార వాయువుని
అంతెరగని స్వార్థంతో పర్యావరణాన్ని
ధ్వంసం చేస్తున్నందుకు
ప్రకృతి ప్రకోపించి విలయతాండవంతో
క్యుములోనింబస్ లు
అతివృష్టి, అనావృష్టిలు
కరువులు కాటకాలు
అంతు చిక్కని కరోనా లాంటి వ్యాధులతో
విధ్వంసం సృష్టించి
మనిషి మనుగడనే ప్రశ్నిస్తూ
ఈ పాపం మీదేనంటూ ఘోషిస్తోంది
దిక్కుతోచక ముందు చూపులేని
అధికారం నిస్సహాయతతో
చేతులెత్తేసి మొహం చాటేస్తోంది
ఇహనైనా మానవాళి మేల్కొనాలి
తల్లి వంటి ప్రకృతిని పొదిమి పట్టుకోవాలి
బ్రతుకులోని పచ్చదనాన్ని పాడుచేసి
చేజేతులా మోడు కానివ్వొద్దు
( వరుసగా కురుస్తున్న వర్షానికి కుదేలైన మన 'అభాగ్యనగరం' బ్రతుకు చిత్రానికి చలించి)



-డా. కె. దివాకరా చారి
9391018972

## అభాగ్యనగరంలో కన్నీటి వరదలు..!

అదిరి బెదిరిన 'హై"డర్'బాదుడే
అర్ధరాత్రి మె?గులుకు పడ్డ చిల్లులు
పగబట్టి కసితో ఘర్జించిన మేఘాలు
పూనకంతో ఊగిన ఉప్పెన ధారలు
కుండపోతకు ఆగమాగమైన బడుగులు !

నాలాల్లో ఆవేశంతో ఎగిసిపడ్డ అలలు
చెరువు అన్వేషణలతో జలపరుగులు
ఆకాశ హర్మ్యాలను చూసి ఆశ్చర్యాలు
అంతా మునిగిన ఆక్రమిత ఆవాసాలు
భూబకాసురులు మింగిన చెరువులు !

కన్నీళ్ల వరదల్లో ప్రాణం కోసం పరుగులు
గూడు, గుడ్డ, బువ్వ జలార్పణలు
నిండా ముంచేసిన వాగులు వంకలు
దారి దొరకని వరదలు, జనజీవులు
వాన వెలిసినా వదలని ఉగ్ర వరదలు !

ఇండ్లను వదలని వరద ముంపులు
వరద తరిగి బురద తేలిన వాడలు
బురదమయమైన ఇళ్లు, వాకిళ్లు
అన్నం, ఆశ్రయం కరువైన అభాగ్యులు
దిక్కు తోచక భీతిల్లిన ధీనజనులు !

కాగితపు పడవలైన కార్లు, బస్సులు
ప్రవాహంలో కొట్టుకు పోయిన ఆశలు
బెండ్లలా తేలిన నగరవాసుల కళేబరాలు
కానరాని సర్కారు సహానుభూతి చేతులు
పీడ కలల్లో తిష్టవేసిన జల ప్రళయాలు !

పడవల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న పార్టీలు
ఆదుకోవడానికి బదులు ఓట్లు అడుక్కోవడాలు
శవాలపై పేలాలు ఏరుకునే ప్రబుద్ధులు
పలుచబడ్డ ప్రజాస్వామ్య విలువల వలువలు
ప్రజలను పట్టించుకోని పాలకుల పథకాలు !

గొలుసు కట్టు చెరువుల గొంతు కోసినోళ్లు
గూడు చెదిరి గుండెలు అదిరినోళ్లు
నాలాలు మింగేసి కొంపలు కట్టి నోళ్లు
వరద బురదను బహుకరించినోళ్లు
భాగ్యనగరాన్ని నరకంగా మార్చినోళ్లు !

కాలుష్యాన్ని సంకనెత్తుకున్న నరులు
మూసీలో పారిన అవినీతి కంపులు
ఆర్పాలి ఆక్రమణల భావజాల జ్వాలలు
లెంపలేసుకోవాలి అల్పబుద్ధి నరులు
పునర్నిర్మించాలి సహజ జలావరణాలు !



- డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## నానీలు

మబ్బుల దాహార్తికి
మండే సూరీడు.....

వానకు సూచన
నలుపెక్కిన మేఘాలు...

మేఘాల కవ్వాలి
మెరుపుల నాట్యాలు
నేల మురిసే....
రాగాల జల్లులకు....

పాడి పంటలు
చెరువులు నిండితే....
రైతుకు కడగండ్లే
నదులు పొంగితే...



-కళావతి కందగట్ల
9948263004

## మోయతుమ్మెద

మాకిప్పుడు శార్వరీ కాదు
వర్షన్నామ సంవత్సరం
ఊ.. అన్నా చినుకులే..
ఊహూ..అన్నా చినుకులే ..!
తెల్లవార్లూ రాలిపడేవి
చినుకుల పారిజాతాలే..!
వరుణుడిది..ఆగ్రహమో..
అనుగ్రహమో తేల్చుకోలేకున్నాం..
పాతాళాపు జల కాస్తానా దోసిట్లో గంతులేస్తోంది..
మా చిన్నప్పటి
చాద బావులిప్పుడు లెవ్వుకానీ..ఉంటేనా..!
నీటిఊటను నింగిఅంచుల దాకా పుక్కిలించునేమో..
అన్నట్లు..ఇప్పుడు చూడాలి..
మా కరువు గడ్డమీది
మోయతుమ్మెద తుళ్ళింతలని..
నిన్నటి ఇసుక తెమ్మెరలు ఎక్కడికి జారుకున్నాయో..గానీ
ఇప్పుడు మాత్రం ఎగిడిపడే జలకళ
మా బడిపిల్లల్లాగే రోడ్డుమీద కబడ్డీ ఆడుతూ
రాకపోకలనడ్డగిస్తోంది తుంటరి
ఈ జింకపిల్ల పరవళ్లు
మానేటితో సంఘమించి
గోదారిలో పరవశించాలనే..!
నీరు పల్లమే అనుకుంటాం..కానీ
ఈ వాగమ్మ మాత్రం
తూరుపున పుట్టి పడమటి మిట్టకే..అడుగులు
ఆ కొత్త సంగీతపు హోరు...
ఏ ఉద్యమ జోరునో తలపిస్తోంది
చీకట్లను తరిమేందుకు వెళుతున్నాను కదా
తన అరచేతులు పరిచి
నన్నావలి గట్టున దించిందీరోజు వాగుతల్లి..
ఎక్కడ పుట్టిందో పిల్లకాలువలా
ఊళ్లనీ బీళ్లనీ ఏకంచేస్తున్న పరుగులు
సింగరాయ గుట్టల్లో హ్వాయలు పోతూ
జలపాతమై దుంకే..ఈ వయ్యారి
అందాలకు రెండు కళ్ళేం సరిపోతాయి..
ఒళ్ళంతా మొలిపించుకొని వెళ్ళాలి
చెరువుల్నీ కుంటల్నీ ఏకం చేసి
శనిగరమూ ఎల్లమ్మలతో..దీని సయ్యాటలు..చూడముచ్చట
ఇది ప్రవహించిన నేలంతా
పంటచేన్ల పచ్చదనమే..
యేరొడ్డున ఊరంటే..
మా బస్వాపురం నే చూడాలి..
ఊరి చుట్టూతా పరచుకున్న వాగుతల్లి నీటిచీరె
సీతమ్మ సింగిడి లాగే..!
యే చిత్రకారుడు
కుప్పపోసాడో ఈ ల్యాండ్ స్కేప్ ఆర్ట్ ని
ఇది మా కరువు సీమన ప్రవహిస్తున్న సెలయేరే కాదు
మా కళ్ళ ల్లోంచి జాలువారుతున్న
ఓ సుమధుర సుందర జీవనగీతం..!



-నాంపల్లి సుజాత
9848059893










# ముమ్మాటికి...ఊరు దస్తూరొక సామాజికశాస్త్రమే..!

నిజాం నిరంకుశత్వ పాలనకు ఎదురొడ్డి
నిలిచినవి తెలంగాణ పల్లెలు.
రైతాంగ సాయుధ పోరాటానికి పట్టుగొమ్మలైనవి తెలంగాణ పల్లెలు.
భూపోరాటాలకు ప్రతీకలైనవి తెలంగాణ పల్లెలు.
కమ్యూనిష్టు, మావోయిస్టుల ఉద్యమాలతో చైతన్యవంతమైనవి తెలంగాణ పల్లెలు.
ప్రజాస్వామిక రాజకీయ వెల్లువలో తలెత్తినవి తెలంగాణ పల్లెలు.
స్వరాష్ట్ర సాధనకై అహర్నిశలు
సమరరాగాలైనవి తెలంగాణ పల్లెలు.

నిజాం నిరంకుశత్వ పాలనకు ఎదురొడ్డి నిలిచినవి తెలంగాణ పల్లెలు. రైతాంగ సాయుధ పోరాటానికి పట్టుగొమ్మలైనవి తెలంగాణ పల్లెలు. భూపోరాటాలకు ప్రతీకలైనవి తెలంగాణ పల్లెలు. కమ్యూనిష్టు, మావోయిస్టుల ఉద్యమాలతో చైతన్యవంతమైనవి తెలంగాణ పల్లెలు. ప్రజాస్వామిక రాజకీయ వెల్లువలో తలెత్తినవి తెలంగాణ పల్లెలు. స్వరాష్ట్ర సాధనకై అహర్నిశలు సమరరాగాలైనవి తెలంగాణ పల్లెలు. తెలంగాణ పల్లె సంబురాలను, కన్నీటి వ్యధలను గూర్చిన చారిత్రాత్మకమైన విశిష్ట రచనగా 'ఊరి దస్తూరి' వెలువడింది. ఇప్పటి వారికి ఉపయుక్తమైన పాఠ్యగ్రంథమిది.

ఊరంటే ఒక వల్లమాలిన ప్రేమ. ఊరంటే ఒక వొడవని ముచ్చట. ఊరంటే ఒక కలవరింత. ఊరంటే ఒక వలపోత. ఊరంటే ఒక జ్ఞాపకాల చెలిమి. ఊరంటే ఒక సలుపుతున్న గాయం. ఊరంటే ఒక ఊరడింపు. ఊరంటే ఒక సోపతిగాని అనురాగం. ఊరంటే ఒక తల్లి ఆత్మీయస్పర్శ. ఊరంటే ఒక కలల కలబోత. ఊరంటే తనువంత పులకరింత. ఊరంటే ఒక అనిర్వచనీయమైన పలకరింత. ఊరంటే ఉరకలెత్తుతున్న ఉత్సాహం. ఊరంటే ఆకాశంలో ఉరుముతున్న ధ్వని. ఊరంటే ఒక ఊరేగింపు. ఊరంటే ఒక పాటగాడి ఆలాపన. ఊరంటే ఒక తంగెడు పువ్వు నవ్వు. ఊరంటే ఒక చెరువు మత్తడి దూకుడు. ఊరంటే ఒక జలసవ్వడి. ఊరంటే ఒక మాటల పాటల సంగీతం. ఊరంటే ఒక పాలధారల వంటి ముచ్చట్లు. ఊరంటే సకల కళల, జనుల సామూహిక సముదాయం. ఊరంటే బావి గిరకల చప్పుళ్ళు. ఊరంటే జన చైతన్య దివ్వెలని ఊరు దస్తూరిలో తిలకించవచ్చు.

అన్నవరం దేవేందర్ ఊరు దస్తూరి ఒక సామాజికశాస్త్రమే. ఊరు నుండి ఎదిగివచ్చిన బిడ్డడు. పట్నంలో తప్పిపోయిన పల్లె బిడ్డ అతడు. అందుకే తన ఊరు జాడను 'తొవ్వ'లోని 'నడక'లో కనుక్కున్నాడు. 'పొక్కిలి వాకిళ్ల పులకరింత'గా విలపిస్తున్నాడు. 'బుడ్డ పర్కలు, బొడ్డుమల్లె చెట్టు, పొద్దుపొడుపు' అంటూ కవిత్వగానంతో పల్లె పదాలు పాడుతున్నాడు. 'ఇంటి దీపం, బువ్వకుండ, వరిగొలుసులు' గా ఊరూరు తిరుగుతాండు. మీకు తెలిస్తే చెప్పండి..కొంచెం ఊరడించండి అతణ్ణి. అలాగే ఒదిలేస్తే ఏ వాడలోని అరుగు ముచ్చట్లలో ప్రత్యక్షం అవుతాడో తెలియదు. 'మరోకోణం'లో ఆవిష్కరణ చేస్తున్న తెలంగాణ పల్లె సౌందర్యాన్ని మనసారా వీక్షించండి.

ఇవి కథలు కావు. నవల అంతకన్న కూడా కాదు. ఇదొక చరిత్ర. తెలంగాణ సాంస్కృతిక చరిత్ర. గతించిన కాలానికి వర్తమాన వ్యాఖ్యానం. జీవంతో సలుపుతున్న గాయాలు. మరువని దృశ్యాలకు అక్షరీకరణ. తెలంగాణ సాంస్కృతిక చిత్రణ అనేది ముమ్మాటికి కాదనలేని వాస్తవం. ఇదొక పోతారం (యస్), అంతకపేట, హుస్నాబాద్‌లలోని జీవితాలే కాదు. తెలంగాణలోని అన్ని పల్లెల సామూహికి జీవనా నికి నిలువెత్తు నిదర్శనమీ 'ఊరి దస్తూరి' వ్యాససంపుటి.

'ఊరొక తీరు తీరు కావ్యం. పల్లె పల్లెలో పారుతున్న సాంస్కృతిక వారసత్వం. పుట్టి పెరిగిన ఊరంటే ఎవలకైనా పావురమే. ఆ పల్లె కలుపుగోలుతనం ఇప్పుడు మచ్చుకైనా లేకపోవచ్చు, ఉండవచ్చు, కాని అదొక చరిత్ర. అదొక ఆచార వ్యవహారం. రెండు మూడు దశాబ్దాలుగా సామాజిక జీవన రంగాల్లో చెప్పనలవి కాని మార్పులు వస్తున్నవి. అలనాటి ఊరును అద్దంలా చూపించేదే ఈ ఊరి దస్తూరి' అని అన్నవరం తన మాటలో చెప్పుకున్నట్టుగానే ఉంటుంది. 'మన తెలంగాణ' దిన పత్రిక ఆదివారం అనుబంధం 'హరివిల్లు', 'దునియ'లలో ఫిబ్రవరి, 2015 నుంచి డిసెంబర్ 2018 వరకు 'ఊరి దస్తూరి' కాలమ్‌ను రాయడం వల్ల మననొక చక్కని పల్లె గూర్చిన పుస్తకం లభించింది. 162 వ్యాసాలు ఒక్కొక్కటిగా చదువుతుంటే మనసంత పొక్కిలి పొక్కిలి అవుతున్నది. చదివేది తెలంగాణ పల్లె బిడ్డడు అయితే తన చరిత్రను తాను చదువుకున్నట్టే. మరొకరైతే గ్రామీణ ప్రాంతంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయాలతో పాటుగా అనుబంధ సంబంధాలను గూర్చి కూడా చదువుకున్నట్టే.

'ఊరు ఊరంతా వొడవని ప్రేమ'లో 'ఊరు ఊరంతా ఒగలకొగరు సుట్టాలెక్క. ఊరంటే ఎవలకైన కన్నతల్లి లెక్కనే. ఊల్లె ఎన్ని కులాల అంత్రాలు ఉన్నా ఎవలకు వాల్లకు గౌరాంతమే. ఈ నడుమనైతే ఊరు సదువుకున్నోల్లతోని సగం ఖాళీ అయింది. ఊరిడిశి పోయనోనికి ఊరి మీద బమ తెలుస్తది. ఊరంటే శిన్నతనం యాదికస్తది. బల్లెకు పోయింది. సార్లతోని దెబ్బలు తిన్నది. బతుకమ్మకు తంగెడుపువ్వుకు పోయింది. పీరీల గుండంకాడ అసోయ్ దుల ఆడింది. చిరుతల రామాయణం సూసింది. సిందు మాదిగోల్లు ఆటలు ఆడింది. సైకిల్ కైంచి నేర్చుకున్నది. పక్కూరికి నడిచి బడికిపోయింది. రెండు కుంచాల వడ్లు నెత్తి నెత్తుకొని గిర్నికాడికి పోయి పట్టిచ్చుక వచ్చిం ది. పిండి బత్తాలు సైకిల్ మీద ఏస్కచ్చింది. చింత కింత చిర్రగోనె ఆడింది. నాలుగ బాటలకాడ ఆలెంక ఈలెంక ఆటలు ఆడింది. అన్నీ యాదికస్త యి. ఇప్పుడు ఊరు సుత మారవచ్చు గని నలభై ఏండ్ల కింది ఊరంటే ఊరే మరి' అన్నట్టుగా అల్లాంటి ఊరు గూర్చిన అక్షరయాత్ర ఇది.



ఊరి ముచ్చట్లు అనగానే కొందరితో జరిపిన సంభాషణలు యాదికి వస్తున్నాయి. సంగీత సాహిత్యాల గూర్చి సాహితీద్రష్ట, తెలంగాణ వైతాళికుడు సామల సదాశివ గారు చెప్పిన మాటలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుపడాలంటే గ్లోబలైజేషన్‌కు లోకలైజేషన్‌నే విరుగుడని, విడమర్చి చెప్పిన కళాశ్రమం నిర్వహకులు, ప్రసిద్ధ శిల్పి రవీంద్రశర్మ గురూ జీ మాటలు, ఆదిలా దాబ్ ఏజేన్సీలోని ఆది వాసుల గూర్చిన అనేక విషయాలను కూలం కషంగా వివరించ గలిగిన పాత్రికేయ మిత్రుడు సయ్యద్ కరీం మాటలు, మా ఊరి ముచ్చట్లు మహాభారతం కథలా ఊరించుకుంటు చెప్పే నా సాహితీ గురువు, ఆదర్శ వ్యాయా మ ఉపాధ్యాయులు ముప్పా మల్లేశం గారి నోటి నుండి వింటుంటే అద్భు తమైన జానపద కథల్లాగుం టాయి. ఈ మహానుభావులు చెప్పుతుంటే ప్రత్యక్షంగా వినడం ఒక అనుభూతి. గంటలు క్షణాల్లా గడిచిపోయిన రోజులు గుర్తుకు వస్తున్నాయి అన్నవరం దేవేందర్ ఊరు దస్తూరి చదువుంటే. నేను వాళ్ళకు ఎదురుంగా కూర్చొని విన్న ముచ్చట్లే గుర్తుకువస్తున్నాయి. ఇవి కథలు కాదు కాని మన కథల్లా అనిపిస్తాయి. ఈ ఊరు వాస్తవ కథనాలు జీవమున్న అనుభవాలు. మనస్సును తట్టిలేపే తియ్యటి జ్ఞాపకాలు. పసిపిల్లలను జోకొట్టే జోలపాటలు.



ఊరు అంటే కొందరికి గిట్టదు కావచ్చు. గ్రామాలు అభివృద్ధి చెందిననాడే దేశం అభివృద్ధి చెందినట్టు అని గొప్ప గొప్ప నాయకులు సందేశాలు ఇచ్చారు. అభివృద్ధి ఏమో కానీ ఊరి సంస్కృతి ఆధునీకరణ పుణ్యమా అని మచ్చుకు కూడా కానరాకుండ పోతున్నది. స్వయం పోషకంగా ఉండే గ్రామలు పరాధీనంగా మారుతున్నవి. అనుబంధాలు, మానవ సంబంధాలకు నిలయాలుగా విలసిల్లిన ప్రాంతాలు రక్తసిక్తమౌతున్నాయి. మా తరం దాక అనుభవించిన తీపి గుర్తులు ఈ తరానికి తెలియడం కోసమైన ఈ పుస్తకాన్ని నేటి యువతతో చదివించాలి.

ఊరంటే ఒక కలివిడితనం. ఒకప్పుడు ఊళ్ళో మంచినీళ్ళ శాదబాయి కాడ అమ్మలక్కల కబుర్లకు కేంద్రంగా ఉండేది. అత్తల గూర్చి కోడళ్ళు చెప్పుకోనేది, ఇంటికి వచ్చిన సుట్టపోళ్ళ గూర్చిన సమాచార కేంద్రంగా ఉండేది. 'అన్నీ తెచ్చుకునుడు ఇచ్చుకునుడే' ,'అమ్మమ్మ బావమ్మల ఎగిలివారంగ వనులు', 'ఒక మరణం..ఊరంత దుక్క సముద్రం','వరుసనై వాల్లతో పరాశ్కాలే..పరాశ్కాలు', 'నాలుగైదు ఊర్లకో బడి ...నడిశి పోయి సదువుడు','పని చేస్తేనే జీవ సౌందర్యం', 'అధర్మం కన్పిస్తే ఊరోల్లు నిలదీస్తరు', 'తొక్కులు పెట్టుకునుడు ఎండుగలు ఎండపోసుడు', ఇల్లు ఎక్కడ అంటే, ఇంటిదాక తీసికపోతరు', 'ఊరన్నకాడ పెద్దమనుషులు, దద్వతులు ఉంటాయి', తాటివనం శ్రమజీవుల కవన కేంద్రం', ఊరు సుట్టూ చెట్లు గుట్టలు ఉంటుండె', 'పాత నమ్మకా లు పోనే లేదు, కొత్తయి కొన్ని', 'తిట్టుకు ఒక తీరుంటది', 'సుట్టాలు వస్తుం డ్రంటేనే సంబురం', 'సోపతి గాళ్ల ఆత్మీయత', 'చెట్టుచేమా గుట్టలు పిట్టలు ఉంటేనే ఊరు', 'నగదు పనిలేని కాలం, ఇత్తులే కొలమానం', 'ఇండ్లల్ల పెద్దమనుషలే మిగులు తుండ్రు', 'ఊరన్న కాడ తాకట్లు పెట్టెటోల్లు మస్తుంటారు' వంటి వ్యాసా ల్లో ఊరు విశ్లేషణ ఆకట్టుకుంది.

ఊరంటేనే వ్యవసా యం. రైతులు, రైతుకూలీ లతో నిండి ఉండేది. కుల వృత్తులతో విలసిల్లేది ఊరు. ఒకరికి ఒకరు తోడుగా, కలిమి లేమిలతో సహవా సం చేసేవారు. కాలం కాని రోజుల్లో కరువును భరించిన వారు. రైతు జీవనమే దు:ఖభరితం. పండిన పంటకు గిట్టుబాటు ధర రాదు. పెట్టుబడి రాక అతను పడే బాధను చూసన్నానే ఉంటాం. పండించిన ధాన్యం లో అందరికి పంచి మిగి లింది అమ్ముకునేది. దేశానికి అన్నం రైతన్న బతుకు బరువై ఆత్మహత్యలకు పాల్పడే ఊరును చూసి కలత చెంద కుండా ఉండలేరు కదా. 'బువ్వపండించే రైతన్నా.. నువ్వు బతకాలె..' వ్యాసం లో ఇలా అంటున్నారు. 'పట్టెడన్నం పండించి సమస్త మానవులకు బతుకునిచ్చే, ఎవుసం దారుడు తనకుతాను గా సచ్చిపోవుడు ఇయ్యాల రేపు ఊర్లల్ల దుక్కపాతం. రైతు సచ్చిపోని ఊరు లేదు. తనకు తాను ఉరితాడు పేనుకొని, తనకు తాను పురుగుల మందు కొనుక్కవ చ్చుకొని, ఈ లోకం నుంచి శాశ్వతంగా ఎల్లి పోతున్నడు. ఇది జరగాల్సింది కాదు కాని జరిగిపోతున్నది. రైతుకు ఆత్మాభిమాం ఎక్కువ. మోసం చెయ్యడు. అబద్ధం ఆడడు. తిమ్మిని బమ్మి చెయ్యడు. రెండు నాల్కల మాటలురావు ఎద్దులాంటివాడు. ఒక గంగిగోవులాంటి వాడు రైతు. ఉత్తపున్యానికే సత్తండు అన్పిస్తది. కాని ఆయనకున్న అప్పులు సుత నాలుగైదు లక్షలే, భూమి జాగ అమ్మలేనని, బతుకలేనని ఆయన చనిపోతండు. ఇది ఊరూర దుక్కాన దుక్కం. ఒగలను చూసి ఒగలు సావబట్టిరి. సావు కర్సులు కూడ లేక విలవిల లాడుతుండ్రు. ఇది ఏ ఊరికి పోయినా ఇవే వార్తలు విన వస్తున్నాయి'.

సోల, కుంచం, గజం, తులం, శేరు వంటి కొలమానాల గూర్చి, తాంబాలం, గంగాలం, గోకర్ణం, కొప్పెర వంటి పాత్రల గూర్చి, వెయ్యికండ్ల పట్వ, గరిగబుడ్డి, గాజబొత్త, కుండలు, గురుగులు, ముంతలు, నీళ్ల గోళెం, కురాడి కుండ, కంచుడు, రొట్టెపెంక, మంగులం, కూజ, కల్లు బింకి, లొట్టి, పూలతొట్లు, దీపంతలు చేసే కుమ్మరుల గూర్చి, సైకిల్, గడియారం, రేడియో ఉంటే ఆనాడుండే గౌరవం గూర్చి, సందుగ, తనబ్బి, బొట్టుపెట్టె, దీగుడులల్లో దాచుకునే వాటి గూర్చి, గూడ, మోట, ఆయిల్ ఇంజన్, కరెంటు వంటివి వాటితో చేన్లకు నీరుపారించుటలో వచ్చిన మార్పుల గూర్చి, కట్టెల పొయ్యి, ఉనుక పొయ్యి, దాలి, వొత్తు వంటి పొయ్యిల గూర్చి, సంక్రాంతి సకినాలు, గారెలు, ముగ్గుల సంబురాల గూర్చి, ఎక్కదీపం, కందిలి, లాంతర్లు, పెట్రోమాక్స్ లైట్లు అంటూ ఆనాటి దీపాల గూర్చి, బతుకమ్మ పాటలకు చేసే నృత్యాలను గూర్చి, ఊరూరిలో విశిష్ట వ్యక్తులైన భూములు కొలిచేటోళ్ళు, శాద బాయిలు తవ్వేటోళ్ళు, పాములు పట్టేటోళ్ళు, ఆర్.ఎం.పి వైద్యుల సేవల గూర్చి,పశువులకు, గొర్లకు వచ్చే రోగాలకు వైద్యం చేసేవాళ్ళు, గడ్డివాము పేర్చేవాళ్ళు, గుడిసెను కప్పేటోళ్ళు, భాగోతం కథలు చెప్పేటోళ్ళు, ఆడవేశాలు వేసేవాళ్ళు, మంత్రసానుల గూర్చి వివరించే వ్యాసాలు మళ్ళీ మళ్ళీ చదివిస్తాయి మనల్ని.

ఊరు మీదున్న ప్రేమ వల్ల పట్నం మీద బుస బుస అక్కడక్కడ కనబడుతుంది. పల్లె జీవన సంస్కృతికి నగర జీవనసంస్కృతికి మధ్యనున్న వ్యత్యాసాలను వివరిస్తుంటారు. అరుగుల మీద ముచ్చట్ల కాలం పోయిందనే వేదన కనబడుతుంది. 'ముచ్చట్లు పెట్టుకునేందుకు ఓ సమయం ఉంటది. అట్లనే ఒక తావు ఉంటది. ముచ్చట్లు అంటే ఊరు మీద జరిగే ముచ్చట్లు. ముచ్చట్లకు ఎజండా ఏమి ఉండది. నడుస్తున్న దాన్ని మాట్లాడుకునుడు. ఇప్పుడంటే ఎవల సెల్లుల వాల్లకు వాట్సప్ గ్రూపుల గుమికూడి ముచ్చట్లు పెట్కుకొని సమాచారం అదం బదలు చేసికుంటుండ్రు గని ఎన్కట ఊర్లల్ల అంత సమాచారం అందరికి చేరేది. అరుగుల మీద కూకొని మాట్లాడుకునేది'.

దేవులపల్లి కృష్ణమూర్తి 'ఊరు వాడ బతుకు', కాలువ మల్లయ్య 'అవ్వ తోడు గిది తెలంగాణ', ఉదారి నారాయణ 'అరుగుమీద ముచ్చట్లు', జయధీర్ తిరుమలరావు 'తొవ్వ ముచ్చట్లు'లలో కొన్ని ప్రత్యేకతలను తెలుసుకున్నట్లుగానే తెలంగాణ సమగ్ర ఊరు విషయాలకు కరదీపిక వంటిది అన్నవరం ఊరు దస్తూరి. ఆచార్య ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్, టి.వేదాంత సూరి, గుడిపాటిలు అందించిన ముందుమాటల వ్యాసాలు ఈ పుస్తకం ప్రాధాన్యతను మరింత పెంచుతున్నాయి.

'ఎన్ని చెప్పిన ఒవడని ముచ్చట్లు' వ్యాసంలో ఊర్లల్ల వచ్చిన మార్పులపై తన అభిప్రాయాలను ఇలా వ్యక్తం చేస్తున్నారు. 'ఊరు మనుషల పరంగా, పార్టీలపరంగా, కులాలపరంగా నిర్మాణం అయితన్నయి. ఇదివరకు కులాలు ఉండే మతాలు ఉండే గాని ఇప్పటివి వేరు అప్పటివి వేరువేరు. అట్లనే ఊర్లల్ల భూములకు రేట్లు పెరిగినయి. దాంతో బ్రోకర్లు పుట్టుకచ్చిండ్రు, దళార్లు పాతభూముల కొన్నవాటిని తిరిగి ముందుకు తెచ్చుడు, గెట్ల పంచాయితీలు తాగిపిచ్చుడు తినిపిచ్చుడు పెద్ద మనుషులను మలుపుకునుడు ఇలాంటివి జరుగుతున్నయి. వారు ఒక్క కట్టు మీద లేకుండా పది తీర్ల ఆలోచనలకు తావు ఇస్తంది. అంటే ఒక్క కట్టు మీద ఉండాలని లేదు. ఎన్కట ఒక్క కట్టుమీద అంటే ఊరి పెద్ద చెప్పినట్టు ఇనుడు ఉండే. ఇప్పుడంతా ఆధునిక ప్రజాస్వామిక యుగంలో ఉన్నాం కాని ఊరంటే ఇదొక తృప్తి. అయితే ఊర్లల్ల ఇదివరలా పంతులు అంటే టీచర్ల పాత్ర అధికంగా ఉండేది. ఇప్పుడు అంతగా కన్పిస్తలేదు. ఇది వరకు ఊర్లల్ల నవలలు చదివేవాల్లు పుస్తకాలు చదివేవాల్లు లైబ్రరీల సభ్యులైనవాల్లు ఉండేది. ఇప్పుడు చదవడం ఆగిపోయింది. ఆ పని టెలివిజన్ చేసింది. టీవీల సుట్టు తలకాయలు కండ్లు అతుక్కపోయి ఆడోల్లను మొగోల్లను వికాసం లేకుండా చేస్తున్నాయి. ఇప్పుడు ఊరుకు పట్నం బీమారి అంటుకుంటుదనిపిస్తంది. ఎంతైనా ఊరు ఊరే. పట్నం పట్నమే. ఊరు ముచ్చట్లు ఎంత రాసిన ఒడవయి'.

పల్లె అనుబంధాలు, కులవృత్తులు, ఆచారాలు, పండుగలు, విశిష్ట వ్యక్తులనే విభాగాలుగా ఈ వ్యాసాలను అమర్చితే బాగుండేది. పరిశోధకులకు సులువుగా ఉండేది. కొన్ని వ్యాసాల్లో వచ్చిన విషయాలే తిరిగి వచ్చిన వాటిని ఎడిట్ చేస్తే బాగుండేది. కనుమరుగౌతున్న తెలంగాణ పదాలకు అర్థాలు వ్యాసాల్లో లభిస్తున్నాయి. ఊరు సౌందర్య ధారల్లో తడిసిముద్దవడానికి దస్తూరి పుటల చినుకుల్లోకి అడుగులేయం డి...!

**ప్రతులకు:** అన్నవరం దేవేందర్,
నవోదయ,నవచేతన,
నవతెలంగాణ బుక్ హౌజులో
మరియు ఫ్లిప్‌కార్డులలో లభించును.
చరవాణి: 9440763479



**– గోపగాని రవీందర్**
9440979882

## ఆ గాంధర్వం ఆగిపోయింది



హిమవన్నగం నుండి దూకిన
పవిత్ర గంగాజలం
బాల సుబ్రహ్మణ్యం గానం
వసంత కోకిల
గళంలోంచి పొంగివచ్చిన
కలకూజితం
బాల సుబ్రహ్మణ్యం గానం
అమరలోకం లోంచి
నేలకు దిగి ప్రవహించిన
దివ్య గాంధర్వం
బాల సుబ్రహ్మణ్యం గానం
సంగీత బ్రహ్మ త్యాగరాజు
గానఝరం
బాలుగానం
అన్నమయ్య పదాల
అమృత ప్రవాహం
బాలుగానం
ఆ గళం మూగవోయింది
ఆ గాంధర్వం ఆగిపోయింది
ఎడారిలో నందనాలు మొలిపించిన
బీళ్ళలో శ్యామలరాగం పలికించిన
మోహనరాగం
బాలు గంధర్వగానం
ఆగిపోయింది
ఆ గళం మూగవోయింది
కన్నీరై ప్రవహించింది
రసిక హృదయం
బాలు ఇక లేదని తెలిసి
బాలుగానం
దేవ గంధర్వంలో కలిసిందని తెలిసి
తెలుగు నేల మూగవోయింది
తెలుగు శోకం ఏరులై పారింది
బాలు లేడు
ఆ గాంధర్వం ఇక విన్పించదు
'ఏ శ్వాసలో చేరితే
గాలి గాంధర్వమౌతున్నదో
ఆ శ్వాస ఆగిపోయింది
ఆ గళం మూగవోయింది.



**– డా॥ తిరునగరి**
సెల్: 93924 65475

## ఆగిపోదు ఈ జీవన ప్రవంతి

పేగుతో పోరాడాం
కలరాని నిర్మూలించాం
మశూచిని మట్టుపెట్టేం
మళ్లీ మన జోలికి రాకుండా చేసేం
బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ ఎన్ని వచ్చినా
ఎదుర్కొని నిలబడ్డాం
పోలియోకి శాశ్వత
పరిష్కారం కనుకొన్నాం
ఇంక ఈ కోవిడ్–19 ఒక లెక్కా?
ఇలాంటి సూక్ష్మ జీవులెన్నో
పుట్టి గిట్టుతూ ఉంటాయి
కాని మన జీవనయానం ఆగిపోదు.
గలగల పారే సెలయేరో
గడ్డి పోచలెన్నో కొట్టుకుపోతుంటాయి
కాని ప్రవాహం మాత్రం సాగిపోతూనే ఉంటుంది
ప్రకృతి ఎప్పుడూ సకారాత్మకమే!
మనిషి మెదడే స్వరాత్మకం కాకుండా చూడాలి
ఈ జీవితంలో ఎన్నో మహమ్మారులు
వస్తాయి పోతాయి ఐనా
నిరంతరం సాగిపోతూనే ఉంటుంది
ఈ జీవన ప్రవంతి.



**– డా॥ జి.పరిమళా సోమేశ్వర్**
సెల్: 9490748091

## పూలబాట

సత్య నిష్ట కలిగి నిత్యము నుండిన
మంచి జరుగుతుంది మనకు నెపుడు
పాడు బుద్ధి కలిగి పాడగుటేలరా
పుండలీకుమాట పూలబాట

బంక మట్టి లోని బలమయినజిగురు
కలగియున్న నేల తెలుగు సీమ
కాంతిధార పారు కమ్మని తెలగాణ
పుండలీకుమాట పూలబాట

కల్లు త్రాగ మంచి కాదు పాడగు మేను
మత్తులోన నీవు మరుతు వన్ని
చెడును పనులు గనుక చెడిపోవు బ్రతుకు
పుండలీకుమాట పూలబాట



**–జాధవ్ పుండలిక్ రావు పాటిల్**
9441333315

## లెక్క తేల్చేయాలి...

అవమానింపబడిన ఆడతనం
ఇప్పుడిక సహనానికి
అంతక్రియలు చేస్తూ
ప్రతిఘటనకు పురుడుపోస్తుంది.

నిత్యం ఏదో ఒక విధంగా
ఎక్కడో ఓ చోట వేధించబడుతున్న
తనువుల ఆత్మాభిమానానికి
రక్తాభిషేకం చేసి ఆత్మవిశ్వాసపు
శాలువా కప్పింది.

బలవంతంగా దోచుకోవడానికి
తమ మానాలు వారి స్వీయ ఆస్తులు
కావని వార్తల్లో , చరిత్ర పుటల్లో
నిట్టూర్పుగా మిగిలే దీర్ఘ శ్వాసను
బంధించి రేపటి ఆశల వెలుగును చిమ్మింది.

ఫ్లకార్డుల పై రోదించే అక్షరాలై,
కొవ్వొత్తుల ప్రదర్శనగా మారే అంశమై,
నిరాశల శామియాల కింద జరిగే
అసహనపు సంతాప సభగా మిగలకూడదని ,
కదులుతున్న తమ అస్తిత్వ పునాదులకు ఔ
సంకల్ప బలమనే కాంక్రీటు వేసి పటిష్టం చేసింది.

బలవంతుడు అని బరి తెగించి
మగ కులపు బలుపును ప్రదర్శిస్తే
శరీర అంగాలను పన్ను రూపంలో
కోల్పోవలసినదే..! ముట్టుకోటానికి
ముందుకు వచ్చిన చేతిని శిక్షించాల్సినదే..!
( పొలంలో పనిచేసుకుంటూ ఉన్న 15 సంవత్సరాల బాలిక పై నలభై సంవత్సరాల వ్యక్తి లైంగిక దాడికి దిదిగినప్పుడు ఆమె కేకలు విన్న వాళ్ళ అక్క వచ్చి ఆ కామాంధుడి చేయిని నరికేసిన విషయాన్ని వార్తల్లో విని స్పందించింది )



**–షేక్. నసీమాబేగం**
9603567011

## పరీక్ష...!!

కష్టం అనేది ఒక్కటే
జీవితానికి అసలైన పరీక్ష
జీవితమంతా రాస్తూ
నిరంతరం ఎదుర్కొంటూ
ప్రతినిత్యం ఉత్తీర్ణత కోసం
ఎదురు చూస్తూ ఉండాలి...

పరీక్షలో ముందడుగు ఆనందం
వెనక్కి వెళ్తే విషాదం
మరలా మొదలుపెట్టాలి గమ్యం
జీవిత సాగరాన్ని దాటే వరకు
కాయం కట్టె కాలే వరకు
నిప్పుల కొలిమిలో ఈదుతూనే ఉండాలి
ఆకాశములో గ్రహణాల మాద్రి
తప్పించుక తిరుగుతూనే ఉండాలి...

శరీర శ్రమ చేస్తే
కనీసం పండుతుంది జీవితం
తియ్యగా లేకున్న
కాస్త వగరుగా సాగుతోంది
కష్టము చెయ్యకపోతే
పువ్వు గానే రాలిపోతుంది..

ఎవరి జీవితం వారిదే
ఎవరితో పోల్చుకోవద్దు
విత్తనం ఆకారం చిన్నదే
కాస్త తడి కి విస్తరించింది అనంతం
దాని బ్రతుకు అది చూసుకుంటూ
ఎవరిపై ఆధారపడకుండా కదా..!!

ఆటుపోట్ల కాలం
ఎడారి లాంటిది బ్రతుకులు
కష్ట సుఖాలకు నిలయం
ఎదుర్కొని ఆయుధము శ్రమే
నిర్లక్ష్యం చేస్తే నిప్పై
వెంటాడి వేధిస్తుంది
ఎదుర్కొన్నా వంటే
మలయమారుత గాలిలా
జీవితంలో ఆనందాన్ని నింపుతుంది...



**–కొప్పుల ప్రసాద్**
9885066235

## సూక్తి సుధ

కొంగ దృష్టి చేపల మీద
పాము దృష్టి కప్పల మీద
కుక్క దృష్టి చెప్పుల మీద
దొంగ దృష్టి వస్తువుల మీద.
ప్రతి మనిషికి పేరు ఉంటుంది
ప్రతి చెట్టుకు వేరు ఉంటుంది
ప్రతి ఊరికి దారి ఉంటుంది
ప్రతిసమస్యకు పరిష్కారముంటుంది.
చిలికితే వెన్న దొరికేది
గతికితే రుచి తెలిసేది
మునిగితేనే ముత్యం దొరికేది
బ్రతికితేనే బ్రతుక్కు అర్థం తెలిసేది.
మనిషికి
కావలసింది నేర్పు
ఉండవలసింది ఓర్పు
కోరవలసింది మార్పు
చెప్పవలసింది తీర్పు.



**– పోలయ్య కవి కూకట్లపల్లి**
9110784502

## వనితా నీకు నమోస్తు

వెయ్యి అడుగు వెయ్యి
భరతమాత బిడ్డవై అడుగు వెయ్యి
రాణి రుద్రమ స్ఫూర్తి తో అడుగు వెయ్యి
వీర వనితవై అడుగు వెయ్యి
అనురాగం లో అమ్మ వై అడుగు వెయ్యి
అరుణ తార వై అడుగు వెయ్యి
ఆప్యాయతలో చెల్లి వై అడుగు వెయ్యి
ఆలంబనలో అక్క వై అడుగు వెయ్యి
సౌందర్యం లో లహరివై అడుగు వెయ్యి
విజ్ఞాన సరస్వతి వై అడుగు వెయ్యి
కరుణ లో కామాక్షి వై అడుగు వెయ్యి
సంధ్యా కాంతుల్లో శ్రావణి వై అడుగు వెయ్యి
సూర్యా కాంతుల్లో కిరణమై అడుగు వెయ్యి
వెన్నెలలో జాబిలి వై అడుగు వెయ్యి
నింగిలో ధృవతారలా అడుగు వెయ్యి
పుడమిలో పున్నమి లా అడుగువెయ్యి
గాలి గమకానివై అడుగు వెయ్యి
సంద్రంలో నావలా అడుగు వెయ్యి
ఆది పరా శక్తిలా అడుగు వెయ్యి
నమోస్తు వనితా నీకు నమోస్తు..



**–చిటికెన కిరణ్ కుమార్,** 9490 84 1284

## ఊపిరి "దీపం"

పైశాచికత్వం "పడగ" విప్పుతోంది
రాక్షసానందం "సెగలు" గక్కుతోంది
సాటి మనిషి రక్త మడుగులో
గిలగిలా తన్నుకు చస్తున్నా ...
చలించని బండరాయితనాలు
వెంటాడి హతమారుస్తున్నా...
పట్టనట్లుండు నిర్లక్ష్య వైనాలు
ప్రేమోన్మాది పెట్రోలు దాడికి
మంటల్లో సజీవ దహనమౌతున్నా ...
ప్రేక్షక పాత్ర పోషించు వైఖరులు
క్షతగాత్రుల కేకలు మిన్నంటుతున్నా ...
బ్రహ్మ చెవిటిగా నటించే తత్వాలు
హత్యలు ... మానభంగాలు
ప్రమాదం,విషాద ఘటనలు
కళ్లెదురుగా జరుగుతున్నా?.
కనీస స్పందన మాట అటుంచి
చరవాణిలో బంధించే కుయత్నాలు
సామాజిక మాధ్యమాలకు ఎగజల్లి ?
ఏదో ఘనత సాదినంత సంబురాలు
మనిషిగా పుట్టిన ఓ మనిషి?!
ఇకనైనా బాధితుల పట్ల ?
కాస్త కనికరం చూపిస్తే ..
ఆపన్న హస్తం అందిస్తే ...
సత్వర సమాచారం చేరవేస్తే..
మలిగే ప్రాణ "దీపాలు" వెలుగుతాయి
ఆజన్మాంతం నిను తలుచుకుంటాయి
-(విషాద ఘటనల చరవాణిలో బందించే కరడు మనిషికి మేల్కొలుపుగా?)



**–కోడిగూటి తిరుపతి**
9573929493

## వడ్లు

అన్న నాగలి దున్నాడు
అయ్య అలుకుడు చేశాడు
చెల్లి నారు తెచ్చింది
అవ్వ నాటు వేసింది
అందరం కలుపు తీశాము
పైరు పచ్చగ ఎదిగింది
పొట్టతో నిండుగా మారింది
పాల గింజలనిచ్చింది
గొలుసులు రమ్మని పిలిచాయి
కొడవలి జతలు కదిలాయి
మోపుల బంతి తిరిగింది
గడ్డివాము ఎత్తున నిలిచింది
ధాన్యం రాసి పెరిగింది
బస్తాల సంచులు తరలాయి
గిర్నిలో బియ్యం, తౌడుగా వీడింది
బియ్యం కాగుల చేరింది
అన్నం ముద్దలుగా కడుపు నింపింది
జనులకు బలం పంచింది



**–ఉండ్రాళ్ళ రాజేశం**
9966946084

## రైతు గోస...

ఆరుద్ర పురుగులా నిగనిగలాడాల్సిన
ఆరుగాలం రైతన్న
కరువనే అతివృష్టితో
ఎకరాల్ ఎకరాల్లు నష్టపోయి
తెగులనే పిల్లి కాలి కింద ఎలుకలా
తటపటాయిస్తూ తండ్లాడుతున్న వైనం..

తెల్లటి మనసున్న రైతన్న
తెల్ల బంగారానికై విత్తితే
తెల్లబోయేలా చేసి ఈ దఫా
నల్ల మబ్బులెందుకో
మల్ల మల్లా నేలను చిత్తడి చేస్తే..

మల్లగుల్లాలు పడి కష్టించినా
పూత కాతా కాయలూ తక్కువై
పతనమైపోతున్నడు
అమాస చంద్రుడిలా రైతన్న

మక్కలేసుకున్నోళ్ల స్థితి
ముక్కున వేలేసుకున్నట్లు
టక్కున నోట మాట రాక
చిక్కుకుపోయిన దుఃస్థితి..
కూలీ చేసే కార్మికులూ
కూలీ పెంచీ ఇంగింత
మూలిగే నక్క మీద
తాటికాయ పడ్డ తీరైనది
దేశానికే వెన్నముకైన రైతన్నకు
దిశ చూపి దశ మార్చేదెవరో..?



**–కొక్కె రాములు**
9985341992

## పదముద్రల నవ్య నవనీతం

ఆత్మకు అనువాద రూపం
కవిత్వం.
అక్షర కవ్వం చిలికిన
పదముద్రల నవ్య నవనీతం.
చిమ్మ చీకటిలోనైనా
ఉనికిని కోల్పోని నీడ రూపం.
తరగని సౌరభాలు పొదిగిన
దివ్యాక్షరాల తేజోవిరాజం.
సాహితీ విశ్వంలో
మరో కొత్త వెలుగు వేదం.
వాక్కుకు
అనిర్వచనీయ దివ్యనాదం.



**–ఆచార్య కదారు వీరారెడ్డి**
9392447007

## లాహిరి లాహిరి లాహిరిలో...

గలగలమంటూ నర్తకి అందియల
సడిలా వీనులకు విందులు చేస్తూ...
కొండలపై నుండి దుముకుతూ...
తన దారిలో ఎదురొచ్చిన
రాళ్ళూరప్పలను అల్లేసుకుంటూ...
తన ఒడిలోకి వంగిన
చెట్ల కొమ్మలకు లాలలు పోస్తూ...

తనలోకొరిగిన గడ్డిపోచలను
ప్రేమగా స్పృశిస్తూ సాగిపోయే
సెలయేరును చూస్తూ
ఎన్ని సార్లు మైమరచి పోయానో...

తన ఒడిలో ఆటలాడుకోవాలనే ఆశ
ఆ అలలను వెంటాడుతూ
ఆవలి తీరం చేరిన నా మనసు
ఎన్ని కాగితపు పడవలను
తనలో వదిలి కేరింతలు కొట్టిందో...

పాపికొండల విహార యాత్రలో
ఆ అలలపై విహరించాలనే తీపికోరిక
నావనెక్కి లాహిరి లాహిరి లాహిరిలో
అని పాడుకుంటూ
తీపి జ్ఞాపకపు మూటగ ఎదలో నిలిచిపోయింది!

గోదారమ్మను చూసిన ప్రతిసారీ
ఆ జ్ఞాపకపు మూట విప్పుకొని
నా మదిలో ఆనందాలను నింపుతూనే ఉంది!



**–వెగ్గలం ఉషశ్రీ**
9440370066

## స్వర గంగా తరంగం

తే//గీ// భక్తి శృంగార సందేశ భావములను
తగిన యట్టుల గొంతు నెంతైన మార్చి
విందు సేతువు శ్రోతల వీనులకును
తెలుగు సీమకు నీలోటు తీరు నెట్లు

తే//గీ// తేనె నీగీతి సఖుడేమొ తీపి వెంచె
గానమునకే మకుటము నీగాత్ర మహిమ
రస విశారదా! నీదివ్య రాగ సుధలు
కోయిల కలరవాలకే గుబులు గొలుపు

తే//గీ// పాట బాటగా సాగిన భాగ్య జీవి
మాట రాణించె నీనోట పాట గాను
ఎదలు నీగీతికి నదులై కదలు నీదు
గాన సాగర మందును లీన మవగ

తే//గీ// గీత సంగీత పారీణ కీర్తి చరిత
బంధు వైతివి పాటల బంధమేసి
బాలు నీవంటె పాటల పలకరింపు
ప్రతిదినము కనిపింతువు పాటలోన

తే//గీ// శాప వశమున గంధర్వ సార్వ భౌము
డౌర మాసీమలో పుట్టె ననుచు మేము
ఎరుగనేలేక పోతిమి ఇంత దనుక
స్వర్గ మేగితివా నేడు శాప ముడిగి



– చిరమన వెంకట రమణయ్య
సెల్:9441380336

## ఉపిరి పోద్దాం

ఇప్పుడు అందరు పాజిటివై
నాలుగు గోడల మధ్యలో
క్షణ క్షణం భయం గా...
నెగటివు లా కనిపించడం కోసం
ఎన్ని అవస్థలో
సానిటైజు కుండపోత లా పారుతుంటే
వారమైన అరగని సబ్బుకు
ఒక్క రోజే ఆయుష్షు..
ఇవ్వాళ రోజులు కూడా
రోజులు లెక్క పెట్టుకుంటుంది
తెల్లారిందా మనిషి పాదాల్లో వణుకు
గడప దాటాలంటే
మనిషి గుండె చెరువు అవుతుంది
కరోనా కాలానికి కూడా
సంకెళ్లు వేయాలని మాటు వేసి ఉంది
శ్వాస కూడా నిండుగా
తీసుకోలేని మనిషి
విల విల్లాడుతున్నాడు....
మనిషిని మనిషిని నిండుగా
పలుకరించకుండా చేస్తుంది
ఉమ్మడి వ్యవస్థ ను
స్వేచ్ఛ పేరిట దూరమైనా మనిషి కి
కరోనా ఓ గుణపాఠం అవుతుందా... !
గుండెల్లో పెట్టుకున్న బంధం
సంకెళ్లు తొడుక్కుంది
ఆప్యాయతగా కలుసుకునే చేతులు
భౌతిక దూరం అంటూ జోడిస్తుంది

చిరునవ్వులు చిందించే పెదాలను
మాస్క్ కనిపించకుండా చేసింది...
నోరు ను కట్టి పడేసిన కరోనా
మనిషిని స్వేచ్ఛ జీవితంలో కి
ఎప్పుడు విడుదల చేస్తుందో..
ఇప్పుడు మన ఊపిరి మనలో లేదు
కరోనా కభంద హస్తాల్లో...
అందుకే....
మనసున్న మనిషిగా జీవిద్దాం
మళ్ళీ మన రోజుల కోసం
పోరాటం చేద్దాం...
మన చిరునవ్వుల్ని బతికించుకుందాం
మన గుండె కు భరోసానిద్దాం....



-ఎలగొండ రవి
9848770345

## కాసేపటి మజిలీ

మనసుని కలచి వేస్తున్న బాధ
కన్నీరొలికితే కుదుట పడుతుందని
కన్నులతో నేస్తం చేసి సేద తీర్చమన్నా

కక్ష్య కట్టిన నా కన్నులు ససేమిరా అంటే
కొలుకులలో ఆగిన కన్నీరు మనసును మెలిపెట్టి
వేదనకు గురి చేస్తుంది

నాలుగు రోజుల మజిలీ ఈ జీవితం
నాది అనుకున్నది ఏది మనది ?
నాణ్యమైన బ్రతుకు తప్ప!

నలుగురు నచ్చేలా ఉంటే చాలు
ఎప్పటికైనా కాయాన్ని పడేసేది
ఆ నలుగురే కాదా!

కోట్లకు పడగలెత్తినా కూడా
నాలుగు మెతుకులే కడుపుకు ఆసరా
కంటి నిండా నిద్ర వస్తే పట్టు పరుపే కావాలా!
చింకి చాప కూడా స్వర్గ తల్పమే

మన పని మనం చేసుకుంటూ..
మరొకరి మనో వికాసానికి తోడైతే..

కాల గమనంలో కలిసిన నేస్తాలను ఔ
ప్రశంసించి వారి సంతోషానికి కారణమైతే
ఇది కాదా అందమైన జీవితం

ఏమి వెంట తెచ్చామని మిడిసి పాటు
ఏమెత్తుకెళ్ళాలని ఆరాట పడటం
అంతా వట్టిదే ! మాయా జాలం!
క్రమ్ముకున్న మంచు పొరలే అన్ని

నవ్వుతూ పలకరిస్తూ పోతే..
నవ రత్నాల మూల్యం చెల్లించాలా!
నక్షత్రాలను దోసిట్లో పట్టి ఇవ్వాలా!
చిన్న నవ్వు ఎంత ఆహ్లాదం ఎదుటి వారికి

కల్మశాల గదులను హృదిలో నిర్మించి
అసూయా ద్వేషాలను నిండ నింపి
కళ్ళల్లో కపటాన్ని వెళ్ళ గ్రక్కితే
సాధించేది ఏముంది!

మూన్నాళ్ళ అద్దె కోసం ఈ శరీరం
ఖాళీ చేయక తప్పదు ఇంటి వాళ్ళు చెప్తే
సామాను తో కాదు రిక్త హస్తాలతో
ఉన్నన్నాళ్లు ఆనందంగా ఉంటే చాలు



-లక్ష్మి మదన్
9959186838

## ఎంతవరకీ ఆటలనుకుంటున్నవు?

అమ్మ జన్మనిచ్చినపుడు
నీతో పాటు వచ్చిన నిర్మలమైన మనసును
కాపాడుకున్నావేమో చూడు.

నాన్న తన భుజాలమీద మోసినపుడు
నీ నవ్వులోని నిజాన్ని చూసి విచ్చుకున్నపూలు
ఇప్పుడలాగే వున్నాయా తెలుసుకో?

తప్పటడుగులు నేర్చినపుడు తెలియని నువ్వు
చేసిన పొరపాట్లు నీకు అవే అనుభవాలు...
వయస్సు పెరిగేకొద్దీ తెలియకుండా
ఎదిగేను నీలోని ఆశలు, ఆలోచనలు...
నీ చుట్టూ ఉన్నవారి కలయిలకతో
లోకం పోకడలతో నీకు మేల్కొలుపు.

అందరు నావారే అనుకున్న నువ్వు
ఏ బంధం ఎంతవరకో తెలుసుకుంటావు
పైకి మంచిగా నవ్వి నిన్ను మందలించినా గానీ
లోపలి మనిషిని చూపించే అద్దాలేవి?
నీతో చెలిమి చేసి పైకి పొగిడి
నీ మీద దుమ్మెత్తిపొసే స్నేహాలు
నీ ఎదుగుదలని అభినందించి,
నీ వెనకాల ఓర్చలేని వెర్రిజనాలు....
అందరిముందు చేసే పొగడ్తలు నిజంకావు
వారు తీసే గోతులలోతు కనుక్కునే రోజొస్తుంది
కమ్మగా నోటితో పలకరింపుల వెనుక
మెల్లగా నొసటితో వెక్కిరింతలు.

కొన్నాళ్లేనని తెలుసుకోవాలి
భూమి మీద మనం ఆడే ఈ ఆటలు..
?ఏది నీతో రాదు, చివరకి నీపై చల్లే
ఆ నాలుగు పూలరేకులు...
ఈ జీవితంలోని రోజులంటే ,
ఎరుగని,తెరువని పేజీలు ....



-పల్లె రాజు
9666207288

పుస్తక సమీక్ష

# ఉభయ ప్రక్రియల సమ్మేళనం-కశప






తెలుగు సాహిత్యం ప్రయోగాల పుట్టినిల్లు. కవిత్వం, వచనంలో వివిధ రకాల ప్రయోగాలు పాల్కురికి సోమన నుంచి ఈనాటి వరకు జరుగుతూనే ఉన్నాయి. ఆధునిక కవిత్వంలో జరిగిన ప్రయోగాలను డాక్టర్ సి నారాయణ రెడ్డి గారు తన పరిశోధన గ్రంథంలో తెలిపారు. తర్వాత కూడా నానీలు,రెక్కలు, కైతికాలు.. లాంటి ఎన్నో నూతన ప్రక్రియలు పురుడుపోసుకున్నాయి. వచన రచనలో నవలిక, గొలుసుకట్టు నవలలు... కథల్లో కాలం కథలు, కార్డు కథలు, పేజీ కథలు ..మొదలైనవి ఎన్నో వున్నాయి.

కథకుడిగా గుర్తింపు పొందిన డా. బి ఎన్ స్వామి కశవ అనే పేరుతో పుస్తకాన్ని వెలువరించారు. కశప అంటే కథా శతక పద్యం. వచన రచనలో భాగమైన కథకు పద్య కవిత్వానికి చెందిన శతక ప్రక్రియకు లంకె కలిపారు. స్వామి మొదట చిన్న చిన్న కథల్ని రాశారు, తర్వాత ప్రాచీన,ఆధునిక శతకాలను సేకరించి, కథకు అనుగుణమైన పద్యాన్ని, కథ కింద ఇచ్చారు. ఆ పద్యంలోని మూడవ పాదంలో ఏదో ఒక పదాన్ని కథకు శీర్షికగా నిర్దేశించారు. ఆ పదం కూడా ఎక్కడో ఓ చోట కథలో కనిపిస్తుంది. దీనిలో 117 కథలున్నాయి వాటిలో 1నుంచి 103 వరకు ఒక పేజీ కథలు ,104 నుండి 117 వరకు పేజీ కంటే ఎక్కువ నిడివి ఉన్న కథలున్నాయి.

ఆధునిక కథా వస్తువును తీసుకొని వాస్తవికతకు అనుగుణంగా కల్పన చేసి, ప్రాచీన పద్యాలకు కూడా సమన్వయం చేశారు .

ఇంతకు ముందు సామెతలకు ,చాటువులకు అనుగుణంగా కథలు వచ్చాయి. అంతేకాక 'వేమన సుమతీ శతకపద్యాలకు పురాణ కథలు' పేరుతో శ్రీమతి కుసుమ కె.మూర్తి గారు పద్యాల్లోని పురాణ పాత్రల్ని తీసుకొని, వాటి కథల్ని వివరించారు. ఇంకొందరు వేమన పద్యాలకు నీతి కథల్ని కూడా రాశారు. అవి ప్రాచీన కథకు సంబంధించినవి. కానీ కశపలోని కథలు ఆధునిక కథ లక్షణాలను కలిగి ఉన్నాయి. వస్తు వైవిధ్యం ఉంది.

కశపలో భూ సమస్యలు , విద్యా రంగం, వైద్యం, రాజకీయ రంగం, పర్యావరణం ,భక్తి ,ప్రేమ , కుటుంబం, వలస జీవులు, కోర్టు కేసులు, వృద్ధుల సమస్యలు మొదలైన అనేక వస్తువులపై కథలున్నాయి

దీనిలో శివ తత్వ సారం( గుడి కథ) మొదలుకొని తెలంగాణ శతకం (వేద్క కథ) వరకు ఉన్నాయి. దీనిలో ప్రాచీన ఆధునిక శతకాల్లోని 117 పద్యాలు ఉన్నాయి.

> తెలుగు సాహిత్యం ప్రయోగాల పుట్టినిల్లు. కవిత్వం, వచనంలో వివిధ రకాల ప్రయోగాలు పాల్కురికి సోమన నుంచి ఈనాటి వరకు జరుగుతూనే ఉన్నాయి.

' కూరిమి' కథలో ప్రేమికులుగా ఉన్నప్పుడు అన్యోన్యంగా స్వేచ్ఛగా తిరిగారు. పెళ్లి చేసుకున్నారు . పెళ్లి తర్వాత కొంచెం కొంచెం ఎడమొహం పెడమొహం ప్రారంభమైంది. దానికి కారణం డబ్బు లేమి కాదు .

'పెళ్లికి ముందు స్వేచ్ఛ అధికం. దానికి ప్రేమ అని పేరు పెట్టుకున్నరు. పెళ్లి తర్వాత పరిమితులు అధికం. దానిని భరించలేక జీవితానికి పగుళ్లు పడుతున్నవి సమన్వయంతో పగుళ్లను మూసివేయవచ్చు కానీ అది జరగడం లేదు'. అని బుంగి పాత్ర ద్వారా దానికి కారణాన్ని వివరిస్తారు కథకుడు.

ప్రస్తుత సమాజంలో ప్రేమ పెళ్లిళ్లు కల కాలం నిలవక పోవడానికి ముఖ్య కారణం ఇగో , సర్దుకుపోయే తత్వం లేకపోవడమే అనే సందేశాన్ని ఇచ్చారు కథకుడు. **"కూరిమి గల దినములలో.....సుమతీ"** అనే చక్కని పద్యానికి కూరిమి కథ బంగారానికి వెలిగారంలా అతికింది.

మేదుర భక్తి నీశ్వరుడు మెచ్చగ... అంబలి సమర్పణ చేసి.. వృషాధిప శతకంలోని భక్తి భావన కల్గిన పద్యానికి 'సంతతం 'కథను జతచేశారు. డాక్టర్ అంబలి కేంద్రం పెట్టి , అంబలిని పంపిణీ చేస్తారు. అప్పటి ఆహార అలవాట్లు ఆరోగ్యానికి శ్రీ రామ రక్ష అనే సోయిని కలిగిస్తాడు రచయిత.

పోతన నారాయణ శతకం లోని 'ధృతి' కథలో ఇలా చెప్పారు.ఎన్నో కష్టాల్ని అధిగమించి ,ఉన్నత స్థాయిని అధిరోహించి, ఉన్నత విలువలతో కూడిన ఆదర్శ జీవనాన్ని గడుపుతున్న హరిదాసు గురించి చక్కగా వివరించారు స్వామి .

'నొవ్వక' కథలో కొంత హాస్యాన్ని రంగరించి ,ప్రస్తుత సమాజం లోని అవకాశవాదుల భండారాన్ని బయట పెట్టారు. ఎప్పటి కెయ్యది... అనే ప్రసిద్ధ పద్యానికి సమన్వయం చేశారు .వ్యవసాయం చేస్తే కలిగే కష్టనష్టాలను, రైతులను మోసగించే వాళ్ల దుర్మార్గాన్ని బట్ట బయలు చేసింది 'ఎంపిక' కథ.దీన్ని కపిలవాయి లింగమూర్తి రాసిన ఆర్యా శతకం లోని పద్యానికి ముడి పెట్టారు రచయిత.

కొనకంచి బాలకిషన్ రాసిన పవనపుత్ర శతకం లోని పద్యానికి **'వాక్కు'** కథను జోడించారు. ఆపదలో ఉన్న రోగులను పీక్కు తినకుండా తక్కువ ఖర్చుతో వైద్యం చేసే వాళ్లే దేవుళ్ళు అని వివరిస్తాడు రచయిత. ప్రస్తుత వ్యాపారాత్మక వైద్యులకు కనువిప్పు కలిగేలా కథీకరించారు స్వామి . దీనిలో ప్రధానంగా రెండే పాత్రలు బుంగి, కథకుడు. పానుగంటి జంఘాల శాస్త్రి, ముళ్లపూడి బుడుగు పాత్రలతో బుంగి పాత్రను పోల్చవచ్చు. కథల్లో సూటిదనం క్లుప్తత స్పష్టంగా కనిపిస్తుంది సంభాషణాత్మక శైలి, వర్ణనాత్మక శైలి కనిపిస్తుంది. పాత్రోచిత భాషకు కథకుడు రచయిత పెద్ద పీట వేశారు. కోతి ఆట..లాంటి కథల్లో సందర్భానుసారంగా పాటలు కూడా ఉపయోగించి, ఆసక్తిని రేకెత్తించారు . కొన్ని కథలకు,పద్యాలకు పాక్షిక సంబంధమున్నట్లు కనిపిస్తాయి. **'నా తెలంగాణ కోటి రతనాల వీణ'** అనే మకుటంలో రతనాల కాకుండా రత్నాల అని ఉండాలి.

కశపలో వేమన శతకం నుంచి పన్నెండు, సుమతీ శతకం నుండి ఆరు పద్యాలను స్వీకరించారు. ఇంకొన్ని శతకాలనుండి ఒకటి, రెండు, మూడు పద్యాలను కూడా తీసుకున్నారు. ఒకే కవి రాసిన విభిన్న శతకాల్లోంచి కూడా కథలకు అనుగుణమైన పద్యాల్ని గ్రహించారు. ఈ కశపను పరిశీలిస్తే తొంభై ఎనిమిది శతకాల్లోని పద్యాలను కథానుగుణంగా ఉపయోగించినట్టు అవగతమౌతుంది. ఇంతముందు ఎవరు ఇంత వైవిధ్యం చూపించిన దాఖలాలు లేవు. రచయితకు అభినందనలు.

**ప్రతులకు:** బి.వి.యన్.స్వామి
9247817732



-ఎర్రోజు వెంకటేశ్వర్లు
294557037

## ప్రేమ పక్షులను బతకనిద్ధాం

వారి మధ్య ప్రేమ జలపాతంలా దూకింది
మాటల సాగరం ఉప్పెనలా ఉప్పొంగింది
చెయ్యి లు పెనవేసుకొని ప్రేమ వీణ
తంతులు మీటి ప్రణయ గీతాలు పాడి
చెరువులో తామరంలా వికసించింది.

కలల ప్రపంచంలో తేలిపోతూ
ఊహల ఊయలలో ఊరేగుతూ
మధుర గుళికలు పంచుకుంటూ
కాలజ్ఞాన్ని రాసుకుంటూ
కొమ్మ మీద చిలకా గోరెంకల్లా కలసి
సాగరం లో నావ లా సాగుతున్న

ఉరుములు, మెరుపులు లేకుండానే
"పరువు " అనే పిడుగు పడి
ఆటవికంగా కత్తులు దూసి,అంతంచేస్తూ
మనిషికీ మరణ శాసనం లిఖిస్తున్న
పుడమిని రుధిరపుటేరులు పారిస్తున్న.

అంతరిక్షంలో అడుగు పెట్టినా
కడలిని కడిగేసినా
కంప్యూటర్ యుగంలో కూడా
కులోన్మాధం నాగసర్పం లా బుసకొట్టి
మానవ సమాజానికి సవాల్ విసురుతుంది

గుణం కంటే ధనమే ముఖ్యమా ?
ప్రాణం కంటే "పరువే "ముఖ్యమా ?
ఆస్తులు, అంతస్తులు పునర్నిర్మించుకోగలం కానీ ,
రాలిన పాణాన్ని రప్పించగలమా ?
హృదయాలను కాస్త విశాలంగా చేసుకుని
కరుణ వర్షాన్ని కురిపిద్దాం
ప్రేమ పక్షులను బతకనిద్ధాం



-తాటిపాముల రమేష్ (టీచర్)
7981566031

## కొత్త రెక్కలం?

అంబుది జాలిలేక తోసివేయబడ్డవాల్లం
కరునలేని కాలానికి పుట్టిన
మానిస కాయాలం.
కాలానికి సేవచేసే దేహాలం
కాలం రాసినమారనినుదిటిరాతలం.
కాలం చేసిన మానని గాయాలం
కర్మలచుట్టూ తిరిగే గానుగెద్ధులం
కష్టాల గరళాన్ని ఇష్టంగా
దిగమింగుతున్న శివన్నలం
పనిచోటుకుపరుగెత్తే బసవన్నలం
గంపెడాశల భారాన్ని మోస్తూ
యమునను దాటుతున్న వాల్లం.
జానెడుపొట్టకునోరుకట్టుకున్నవాల్లం
కాలానికి ఊడిగం చేసి కాలచక్రాన్ని,
ముందుకు లాగుతున్న వాల్లం.
కాలమకరికి చిక్కి గింజుకొంటున్న
కరి కాలు భాదలం.
కవులు రాస్తున్న వొడువని
యుగాల గాధలం.
సాయంత్రానికల్లా వాలిపోయే
భానుని సంధ్యా కిరణాలం.
కొత్త రెక్కలు మొలిపించుకుని
రేపటి వేకువను మేలుకొలుపే
పక్షుల కిలకిల రావాలం.



-పి.బక్కారెడ్డి
9705315250

## కాలం మారింది

పిల్లల తలరాతలు మార్చే గురువుల
తలరాతలే తారుమారయ్యాయి
భవిష్యత్తును నిర్మించాల్సినవారు
నేడు భవన నిర్మాణాలకు వెళుతున్నారు
ఎందరికో దిశానిర్దేశం చేయాల్సినవారు
నేడు దిక్కులేని దీనులైపోయారు
ఆశల రెక్కలు తొడిగేవారు
నేడు రెక్కలు తెగిన పక్షులయ్యారు
అందంగా పాఠాలు చెప్పేవారు
అంతులేని పాట్లు పడుతున్నారు
పిల్లలకు పరీక్షలు పెట్టేవారు
జీవితం పెట్టే పరీక్షలకు
తలలు వంచుతున్నారు
బతుకు బరువు మోయలేని గురువులు
సిమెంటు బస్తాలను మోస్తున్నారు
వారి ఆత్మాభిమానాన్ని ఆకలి
చావుదెబ్బ తీసింది
మనసు చంపుకొని కడుపు నింపుకొమ్మంటోంది
వీళ్లంతా మనిషిగా బ్రతకడానికి
మనసుని గాయపరచుకుంటున్నారు
కన్నీళ్లను,చెమటతో కలిపి
మనసుకి మందును పూస్తున్నారు
నిజంగా కాలం మారిపోయింది
నేటి సరికొత్త మహాభారతంలో
ద్రోణుడే గురుదక్షిణగా బొటనవేలు ఇస్తున్నాడు
అస్త్రసన్యాసం చేసి నిస్సహాయుడైనాడు
ఎందరికో విద్యాదానం చేసినవాడు
అన్నదానం చేసేవారికోసం ఆత్రంగా
ఎదురుచూస్తున్నాడు.



-డి.క్రాంతి కుమార్
7396721108

## రైతు నిశానికి విలువ పెరగాలి

పొగచూరిన బ్రతుకు అద్దం మీద
పొలంగట్టు చూడని ప్రతిభావంతులు
ముగ్గుపొడి చల్లి మసిని తుడవాలని
చేస్తున్న ప్రయత్నాలు కాకూడదు మొసలికన్నీళ్ళు

పగుళ్ళ నేలమీద దిగుళ్ళ కన్నీరు కారి
ఇంకిన చుక్కల నీరుకు బక్కచిక్కిన మొక్క
రాల్చిన తాలుగింజల కంకుల మీద
హామీలు లేని హక్కుపత్రం వ్రాసుకోమన్నారు

దారి తెలియని రాజ్యాన్ని వెతుక్కుంటూ
నీ దరిద్రాన్ని నువ్వే మోసుకు తిరగమన్నారు
మిట్ట మధ్యాహ్నం వేళ అరుంధతిని చూపి
తాళి కట్టేశామిక తన్నుకు చావమంటున్నారు

నిశాని బ్రతుకులకు ఆన్ లైన్ అమ్మకాలెందుకు
ఎకరం నేల జీవితాలకు ట్రేడింగు పోకడలెందుకు
నాటే విత్తుకు నిజాయితీ కవచం తొడగాలి
నేల మీద పంటకు నికరపు ధర అందివ్వాలి

ఆసామికి కాదు, అరక పట్టేవాడికి సాయమందాలి
రాలిన గింజల దాచుకునే గిడ్డంగులు కావాలి
వడ్డీలేని ఋణాల పంపిణీ ప్రాణమవ్వాలి
వ్యవసాయం ఉరికొయ్య కాదు, ఊతకర్ర కావాలి

రైతుల వెంట వ్యాపారులు పడే చట్టాలు చేయండి
పండించినవాడికి పట్టునిచ్చే శాసనాలు వ్రాయండి
రైతు వేలిముద్రకు విలువ పెరిగిన రోజు
నగరాలు పల్లెల బాట పడి పల్లెసీమలు వెలుగుతాయి



-శింగరాజు శ్రీనివాసరావు
9052048706

## ఆ ఊరికి వెళ్ళి వచ్చాను

వెళ్ళాను
ఆ నేల మీద తిరుగాడి
నిండిన మనసుతో ఎగురుతూ వచ్చాను

ఆనాడు నన్ను ఎత్తుకుని ఉయ్యాలలూపిన
వృద్ధ వృక్షాలు కూలిపోయాయి

బతుకుపోరులో నిమగ్నమై నడివయసు చెట్లు-
బడిపుస్తకాల బరువు మోస్తూ నేనూ...
ప్రేమను పంచుకోలేకపోయాం

నన్ను లాలించిన తరువులు
ఒరిగిన మట్టిలో మొలకెత్తిన లేత మొక్కలై
ఆపాత ఆత్మీయతా వారసత్వాన్ని చిగురిస్తూ
మళ్ళీ నన్ను అటుగా ఆకర్షించాయి

ఎర్రటెండాకాలం వాగు చెలిమె నీళ్ళతీరు
చల్లగా ఉన్నాయి ఆత్మగల్ల వాళ్ళ పిలుపులు

సట్టిబోనాల నాటి కొత్తబియ్యపు మెత్తటి అన్నంలెక్క
కమ్మగా ఉన్నాయి ప్రేమా ఆప్యాయతలు

వెళ్ళాను
ఆ పల్లెకు తిరిగి ఇన్నాళ్లకు
నా తల్లి కన్నవూరిని చూసి వచ్చాను

అడవికి దగ్గరగా ఉన్నందుకేనేమో..!
చేరువైన వాళ్ళందరికీ హాయినిస్తుందా ఊరు
అడవితల్లి లాగే...

నిత్యం మట్టి దారుల్లో నడిచే ఆ పాదాలకు
చెరగని ఆకుపచ్చని పాదముద్రలు వేస్తూ
నేరుగా మనసింటిలోకి రావడం అలవాటే!

వనం ఎదురవగానే నీరై వర్షించే
మబ్బులతో స్నేహం చేసే మనుషులు కాబట్టే
కలిసిన మనిషినల్లా ప్రేమతో తడిపేస్తుంటారు వారు

వెళ్ళి వచ్చాను
ఆ మబ్బుల్ని తాకి వచ్చాను
ఎన్నో రోజుల తర్వాత ఇలా మళ్ళీ తడిసివచ్చాను!

-నాగవర్మ ముత్యం
9490578855

## దుఃఖపు ఆనవాళ్ళు

ప్రాణాలను గాల్లో నిలబెడుతున్నామందరం
వారాంతపు ఉగ్రూతలులేవు కానీ
వలేసి పట్టుకునే వైరస్ లకు
కొరతలేదు
ఏదైనా జరగొచ్చిపుడు
కెరీర్ పరుగు గుండెకు కోతపెట్టొచ్చు
లగ్జరీ కారు లబ్జుగా చిదిమేయొచ్చు
కాలం కలిసి రాకపోతే
కార్పొరేట్ ఆస్పత్రి కన్నేయొచ్చు
రేపటి మాట దేవుడెరుగు
నేటిమాటకే దిక్కులేదు
ధిక్కరణ దిక్పాలకులే చుట్టూ...

ముట్టుకుంటే మాసిపోయే మనుషులే లేరిపుడు
చుట్టుముట్టే శత్రువులూ లేరు
అంతా నిశ్శబ్దం
ఘర్షణలు,సంఘర్షణల కూడికలు
తీసివేతల్లో మనిషి మసకేసిపోయాడు
భద్రతను ఛేదించే మనిషి
అభద్రతను త్యజించలేక
అంతరంగంలో కాందిశీకుడిలా మిగిలాడు
చరిత్రకారుడిలా దుఃఖపు చారికలను తుడిచే
ఆనవాళ్ళను వెతుకుతున్నాడు...



-సి.యస్.రాంబాబు
8374818961

## నేటి విద్యా విధానం - పరిణామాలు

ఏ విద్య చే శీలం నిర్మాణమవుతూ ఉన్నదో..
వ్యక్తి యొక్క మానసిక పరిపక్వత వృద్ధి చేనీదుతుందో....
బుద్ధి వికసించి విలువైన సమాజాన్ని నిర్మిస్తుందో....
స్వశక్తి తో ఎవరి కాళ్ళ మీద వారూ నిలబడుతారో..
అలాంటి విద్య తోనే ఏ జాతి అయిన అభివృద్ధి పథంలో
ముందుకు దూసుకుపోతుంది అన్నది అక్షర సత్యం.
ఏ దేశ ఆర్థిక అభవృద్ధి కైన వెన్నుముక లాంటిది విద్యనే...
కానీ నేడు సామాన్యుడికి సాంకేతిక విద్య పల్లేర్ల మీద నడకే అవుతుంది.
ఇది ప్రభుత్వ వైఫల్యమా లేదా భోదకుల నిర్లక్షమా అన్నది తేల్చుకోవాలి.
ప్రభుత్వ ఉద్యోగం కోసం అహర్నిశలు కష్టపడి చదివి
సంపాదించుకున్నంత వరకే వారి వాడి వేడి అవుతుంది.
ఉద్యోగం పూల పాన్పు అవుతుందే కానీ సమాజ అభివృద్ధి నిర్మాణంలో
ఆటంకం అవుతుందనే సత్యాన్ని విస్మరిస్తున్నారు.
విద్యా కుసుమాలు సమాజ వెలుగు దీప్తి అయినప్పుడే దాని విలువ.
ప్రభుత్వ కళాశాలలో ఎంత మంది
ఐఐటియన్లు, ఎనైటియన్లు, మెడికోలు గా తీర్చి దిద్దుతున్నరనేది సూటి ప్రశ్న.
ప్రభుత్వం ప్రజా ధనాన్ని వేల లక్షలు వెచ్చిచడం అడవి కాసిన వెన్నెలేనా....
విద్యార్థులు లేరు అనే సాకు తో సంతృప్తి పడి ఆత్మాభిమానాన్ని చంపుకోవద్దు.
విద్యా బోధనతో విద్యార్థుల మనసులను మార్చే మంత్రంగా వుండాలే కాని ...
మన మొకం బాగా లేక అద్దాన్ని పగలగొడితే ఎం లాభం అన్నట్టు వుంటుంది.
మన దగ్గర వున్న విద్యా అస్త్రాలతో సమాజ మనుగడ సేవకులం కావాలి.
కార్పొరేట్ కి సాధ్యమైంది .
క్వాలిఫైడ్ అధ్యాపకులకు సాధ్యం కాదా !
విదేశీ విద్యా విధానంలో ప్రెసిడెంట్ కొడుకైన ప్రభుత్వ కళాశాలలో చదువాల్సిందే.
అటువంటి పటిష్టమైన చట్టాలు తెచ్చి విద్యను బలోపేతం చేయాలి.
ప్రభుత్వం విద్యకు సింహ భాగం బడ్జెట్ ను కేటాయించి జాతిని జాగృతం చేయాలి.



-దేశిని శ్రీధర్
9849818284

## ఏరువాక

పత్తి కాయ
పగలబడి తెల్లగా నవ్వుతుంది

నవ్వులో కల్మషం లేదు
పండించిన రైతు ముఖంలో నవ్వూ అంతే తేటగా

మిరప మిరమిరమంటూ
ఎర్రగా పండి
రారమ్మని రైతుని సాదరంగా ఆహ్వానిస్తుంది
ఎర్రగా కందిన చేతుల మరచి
ఫలితాన్ని ఆస్వాదించ రైతు అడుగులు సాలల్లో

నారు పోసి
నీరుగడితే బురదమళ్ళల్లో
ఏపుగా ఎదిగి ఒయ్యారం ఒలకబోస్తూ
పైరగాలిలో రైతుని మరిపిస్తూ మురిపిస్తూ
బాహువులు సాచి కన్ను గీటుతున్న వరి

ఆరుగాలం శ్రమించితే
దక్కే నోటికాడి బువ్వని
గద్దల పాల్జేసే చట్టాలు
ఓట్ల సీట్ల పందేరంలో
రూపు దిద్ది
రైతు రూపాన్ని మ్యూజియంలో పెట్టే తెగింపు

అశాశ్వత అధికార మదం పెకిలించ
నాగలి కర్రులన్నీ
నేలనొదిలి
రాజధాని వీధుల్లో ఏరువాక సాగాలి
ఎర్రెత్తి పోవాలి ఏలిక



– గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201

## అక్షరాలా మొలుచుకొన్నా...

రాత్రి నా మెదడులో దొంగలు పడ్డారు.
ఎప్పుడూ పక్కనే ఉండే రెండు ఆలోచల్నీ
చీకటితో కప్పేసి,
బయటకు తోసేసి,
భావమాలికల్ని తవ్వి
లంకెబిందెలు లాంటి అక్షరసమూహాలను
కోతకొచ్చిన వ్రాత పంటను
కూతకొచ్చిన లేత కవితలను
చిద్రం చేసిన
ఎర్రని ఎడారి అడుగులు
మనసును తడారచేశాయి.

ఖాళీ కడుపుతో
బీడులా కాగితాలు పేలవంగా మారి
తెల్లవారి నల్లగా ఉదయించిన
నా ముఖంలోకి తొంగిచూసి,
కోర్కెల కొరివితో
తీరని ఆశల భూతం చేసే తాండవానికి
జరిగే మనసు హత్యాచారానికి
ప్రాణం లేని బొమ్మలా మనిషేమిటో?
తలచి తలచి తెలుసుకున్నా
అక్షరాలా వ్రాసుకొని మొలుచుకొన్నా...



-సాహితి
83094 63567







పుస్తక సమీక్ష

# "మొగ్గలు" ప్రక్రియలో కాంతులీనిన బతుకమ్మ

యావత్ భారతదేశంలోనే "తెలంగాణా"కో ప్రత్యేకస్థానం ఉంది. చైతన్యస్ఫూర్తిని రగిల్చి అక్షరకిరణాల జోతుల్ని వెలిగించే కవుల కాణాచి. అలాగే అవనిలో అందరూ హర్షించే ఏకైక పండుగ ×బతుకమ్మ×. తొమ్మిది దినాలు భక్తిశ్రద్ధలతో ప్రతీ పల్లెలో ప్రతి లోగిలిలో జరుపుకుంటూబొడ్డెమ్మగా పిలుచుకునే నాటి పండుగ నేడు ×బతుకమ్మ×గా ఖ్యాతినొందింది.

తెలుగు సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు వెలుగు చూశాయి. పద్యం, గేయం, వచనం ఇలా ఎన్నో ప్రక్రియలు. మారుతున్న కాలానికనుగుణంగా నేడు ఎన్నెన్నో నానీలు, హైకూలు, మినీకవితలు, రెక్కలు ఇలా ఎన్ని వచ్చినా..ఎన్ని ఉన్నా కొత్తగా వచ్చిన ×మొగ్గలు× మాత్రం అనతికాలంలోనే తెలుగు సాహిత్యంలో పరిమళాలను వెదజల్లింది. ఈ ప్రక్రియ సృష్టికర్త ప్రముఖకవి, రచయిత, విమర్శకులు డా.భీంపల్లి శ్రీకాంత్. అనతికాలంలో ఎందరో కవుల్ని/కవయిత్రుల్ని మొగ్గలు ఆకర్షించి...తమ కలముల అక్షరపరిమళాలతో అలరించిందనటం అతిశయోక్తికాదు.

నేడు యావత్ జాతి గర్వించే పండుగ 'బతుకమ్మ'.

సాంస్కృతిక సాంప్రదాయ విలువల్ని పెంచే తెలంగాణ గుండెచప్పుడు. ఆడబిడ్డల్ని చల్లగా చూడమని, మంచి బతుకులను ప్రసాదించమని ప్రకృతిమాతను కొలిచే పండుగ బతుకమ్మ. అంతటి ప్రతీకగా నిలిచిన ఈ పండుగకు అదనపు శోభగా మొగ్గల్లో పరిమళింపజేసిన డా.భీంపల్లి అభినందనీయులు. 100 మంది లబ్ధప్రతిష్టులైన మొగ్గల కవులతో ఈ అక్షరమొగ్గల్ని పూయించిన తోటమాలి డా.భీంపల్లి శ్రీకాంత్.

**"తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకవుతూనే**
**సంస్కృతీ సాంప్రదాయాలను చాటుతూ వస్తున్నది**
**బతుకమ్మ తెలంగాణా వాకిళ్లలో పూచిన పూలగుమ్మ"** అంటాడు భీంపల్లి. అలాగే...

"రకరకాల రంగురంగుల పూలతో సింగారించుకుంటూనే
ఆధ్యాత్మిక శోభతో అలరించే బంగారు కల్పవల్లి బతుకమ్మ
ఆలుబిడ్డలు సందడిగా చేసుకునే పండుగ బతుకమ్మ"అని ...తెలుగింట వెలసిన ఈ బతుకమ్మ ఎలా బ్రతకాలో,ఎలా బ్రతకకూడదో చెప్పి సన్మార్గంలో నడిపే మార్గనిర్దేశనం బతుకమ్మ అని చెప్పటం సమంజసం.

అలాగే.... సృజామి
**"ఊరంతా కలసి ఒకచోటచేరి బొడ్డెమ్మలాడుతూ**
**ఉత్సాహంగా జరుపుకునే ఉత్తమ పండుగ"** అంటాడు.
**"మహిషాసురుని వధించిన గౌరీదేవిని**
**బతుకమ్మా అంటూ స్త్రీలు పూజిస్తారు**
**తొమ్మిదిరోజుల పండుగ బతుకమ్మ"** అని టి.అంబుజ తెలిపింది.

బ్రతుకమ్మకు మరింత శోభచేర్చి పులి జమున
**"కొత్తకోణంలో పసిడివర్ణంలో అరుణకిరణంలా**
**తంగేడుపువ్వు అడవితల్లి సిగలో ఆభరణమైనది**
**ప్రకృతికి ప్రతిరూపం సంస్కృతికి ప్రతిబింబం"** అంటూ చక్కగా వర్ణించింది.

అలాగే అయిత అనిత
**"సద్దుల బతుకమ్మవై నువు సాగిపోతుంటే**
**నీ రాకతో చెరువుతల్లి పచ్చగా నవ్వేనమ్మా**
**తెలంగాణ ఆడపడుచు బతుకమ్మ"** అంటుంది.




మరో కవి గన్నోజు శ్రీనివాసాచారి తన మొగ్గలో
**"బతుకమ్మ తీరొక్కపూలతో సింగారించుకొని**
**ఆపదలు బాపి సంపదలిచ్చే కల్పవృక్షం**
**గౌరమ్మ ఎప్పుడైనా కల్పవల్లి నీవేనమ్మా"** అంటాడు.

బతుకమ్మకు ఉద్యమస్ఫూర్తినింపిన శాంతికృష్ణ
**"ఉద్యమాలకు ఊపిరి పోసేందుకు**
**బతుకమ్మను వాడవాడలా ఊరేగింపు**
**తెలంగాణ అస్థిత్వపతాక బతుకమ్మ"** అని అభివర్ణించింది.

మరోకవి ఆర్.చెన్నయ్య
**"తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించగానే**
**బతుకమ్మను బతికించుకున్నది**
**బతుకమ్మ అంటేనే తెలంగాణ"** అంటూ చక్కగా స్తుతించాడు.

ప్రముఖ మొగ్గలకవి బోల యాదయ్య మరింత లోతుగా...
**"దొరలు గడీలకాడ ప్రజల ప్రాణాలు కూలుతుంటే**
**ప్రకృతి పూలపండుగ ధైర్యమై దండల్లి కాపాడింది**
**ఆపదలను తుంచె అడవిపూలతేరు బతుకమ్మ"** అనటం ముదావహం.

అలాగే సిద్దాంతపు ప్రభాకరాచార్యులు తన మొగ్గలను.. పాటల్లో పరవశింపజేసిన ప్రసిద్ధకవిగాయకుడు గోరటిని స్మరిస్తూ
**"పల్లెలంతా తంగేడు పూలవనంగా మారుతూనే**
**గోరేటి వెంకన్న కలంలో జాలువారింది పాట**
**పల్లెపల్లెలో ఉత్సాహంగా సాగే బతుకమ్మ పాట"** అంటాడు.

బొడ్డు మహేందర్ కలం నుంచి మొగ్గలు మరోలా విరబూసాయి.
**"బొడ్డెమ్మతో మొదలు సద్దుల బతుకమ్మ దాకా**
**సత్తుపిండివంటలు సంప్రదాయ వాయనమాయే**
**తెలంగాణ ప్రజా విజయాల కలువే బతుకమ్మ"** అని నొక్కి వక్కాణించాడు.

అలాగే మంచిని పలికే బతుకమ్మగా అంబటి భానుప్రకాశ్ కలం ద్వారా ఇలా...
**"చావుపుట్టుకలు సహజం అంటూనే**
**బ్రతికినన్నాళ్లు బాగుండమంటుంది**
**మన బాగుకోరే తల్లి బతుకమ్మ తల్లి"** అంటూ బతుకమ్మను ప్రస్తుతిస్తాడు.

ఘాలి లలిత ప్రవల్లిక కలం ద్వారా విరిసిన మొగ్గలు
**"కోల్ కోలాటాల చప్పట్లు ఊయలపాటలతో**
**ఆనాటి చరితల ఇతిహాసగాథలు పాటలయ్యాయి**
**జానపదుల జనజాగృతే బతుకమ్మ"** అంటూ చక్కగా బతుకమ్మను ఆవిష్కరించింది.

ఇంతింతై వటుడింతై అన్నట్లుగా..
పుట్టి గిరిధర్ తన బతుకమ్మ మొగ్గల్లో
**"పల్లెపడుచుల పవిత్రమైన పండుగవుతూనే**
**పట్టణాలకు పాకెను ఆనందాల పండుగ**
**ప్రపంచాన్ని తాకి చూపిన పండుగ బతుకమ్మ"** అనటం అతిశయోక్తి కాదేమో!

చల్లని వెన్నెల కురిపించే జాబిలిలా... వెన్నెల సత్యం తన మొగ్గల్ని ఇలా విరబూయించాడు.
**"చక్కెర అటుకుల నైవేద్యంతో**
**కన్నెపిల్లల కలలు సాకారం**
**అందరికీ అమ్మయింది బతుకమ్మ"** అంటూ బతుకమ్మను అమ్మతో పోలుస్తాడు.

అలాగే ఈవేమన తన మొగ్గల్లో...
**"తంగేడుపూలతో పూజలు చేస్తూనే**
**అందరికీ ఆశీస్సులు అందిస్తావు**
**తెలంగాణ కొంగుబంగారం బతుకమ్మ"** గా అభివర్ణించాడు.

మరోకవి గుంటి గోపి
**"ఆశ్వయుజ శుద్ధపాడ్యమితో మొదలవుతూనే**
**నవరాత్రుల పండుగలా శోభాయమానం చేస్తుంది**
**తెలంగాణ అస్తిత్వగీతిక నవవసంతాల బతుకమ్మ"** అనటం బతుకమ్మకు శోభనిచ్చింది.

మరో కవయిత్రి మన్నె లలిత బతుకమ్మను బహుచక్కగా చమత్కరిస్తూ...
**"కష్టజీవుల కన్నీళ్లలో పెరిగిన విత్తనం**
**నేడు ఫలించి బతుకునిచ్చింది**
**కష్టేఫలి అనే నానుడికి సంకేతం బతుకమ్మ"** అని బహుబాగా చెప్పిన తీరు ప్రశంసనీయం.

అలాగే మరో కవిమిత్రుడు కమలేకర్ శ్యాంప్రసాద్
**"మానవుడు చేసే వికృత చేష్టలతో**
**పర్యావరణం వినాశనమవుతుంది**
**ప్రకృతి ఆదరిస్తేనే కదా బతుకమ్మ"** అంటాడు.

చివరగా సుజాత
**"బంగారం కన్నా బతుకమ్మపాట మధురమవుతూ**
**బొడ్డెమ్మ వేసి బతుకమ్మ ఆడితే అదే అద్భుతం**
**బతుకమ్మ బతుకును నేర్పే తల్లి"** అనటం సముచితం.

నూరుగురు చక్కని మొగ్గలను పూయించేట్టుగా కృషి చేసిన అక్షరమొగ్గల తోటమాలి డా.భీంపల్లి కృషి అభినందనీయం. ఈ బతుకమ్మ మొగ్గలను అందరూ చక్కగా పూయించారు.చక్కని సందేశాలను అందించారు. ఆనందాలను హరివిల్లులను పంచారు. కష్టం-నష్టం సహజం అని వక్కాణించారు. ఉగాది షడ్రుచుల్ని రుచిచూపారు.

**ప్రతులకు:** భీంపల్లి శ్రీకాంత్
సెల్:9032844017



**-మహ్మద్ రఫీ(ఈవేమన)**
7893451307

# దసరా-శరన్నవరాత్రులు



శ్రీ స్వర్ణకవచాలంకృత శ్రీ దుర్గాదేవి | శ్రీ గాయత్రి దేవి | శ్రీ అన్నపూర్ణా దేవి | శ్రీ సరస్వతి దేవి | శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి

గ్రీష్మ ఋతువు ముగియడంలోనే వర్షఋతువు ఆరంభం, వర్షఋతువులో పండుగల సంరంభం మొదలౌతుంది. ఈ ఏడాది వర్షాలు బాగా కురవడం చెప్పకో తగిన పరిణామం. అయితే అతి 'సర్వత్రా వర్జయేతే' అన్న విధంగా దేశవ్యాప్తంగా వర్షాలు భారీగా కురుస్తూ నదులు, చెరువులు, కుంటలు నిండుగా కళకళలాడుతూ, మించి ప్రవహించి జనజీవనాన్ని అతలాకుతలం చేస్తుండటం కూడా చూస్తున్నాం. వాటి దరిదాపుల్లో నివసించే దిగువ, మధ్యతరగతి ప్రజలు జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండి, తగిన చర్యలు చేపట్టవలసి ఉంటుంది. లేకుంటే కరోనా వైరస్ భూతం (కోవిడ్-19)తో ఈ యేడాది ప్రారంభం నుండి కూడా జనజీవనాన్ని ముప్పేట దాడిచేసి, విజృంభించిన దరిమిలా, వేలు, లక్షల సంఖ్యలో ప్రజల ప్రాణాలు పొగొట్టుకున్నారు. ఇప్పటికీ కూడా ఎక్కడా నెమ్మదిస్తున్న దాఖలాలు కనిపించడంలేదు. కరోనా నివారణకు వ్యాక్సిన్ తయారిలో దేశవిదేశాలు పోటీపడుతున్నాయి. స్వయం నియంత్రణే ప్రస్తుత పరిస్థితికి ఆయుధంగా ప్రభుత్వాలు సూచిస్తూ ముందుకెళ్ళటం తప్పనిసరయ్యింది. దీనికితోడు అతిగా వర్షాలు కురవడం వలన జనజీవనానికి మరొక సమస్యగా, ఎన్నో రకాల వ్యాధులు ప్రబలే అవకాశం కూడా కనిపిస్తోంది. ఇప్పటివరకు పండుగలన్నింటిని కూడా ఎవరిండ్లలో వారే జరుపుకున్నాం. ఆవిధంగా ఉగాది, శ్రీరామనవమి, రంజాన్, గణపతి నవరాత్రులు అన్ని జనసమూహంతో సంబరంగా, అట్టహాసంగా జరుపుకోలేక పోయాం. ఈ ఆశ్వీయుజమాసంలో వచ్చే పండుగలైన, 'బతుకమ్మ' (తెలంగాణ ప్రాంత స్త్రీల ప్రత్యేక పండుగ) అదే క్రమంలో 'దసరా' శరన్నవరాత్రులు, 10వ రోజు 'విజయదశమి'తో ముగుస్తుంది. అన్ని పండుగలకు ఆటంకం కలిగించిన 'కరోనా' (కోవిడ్-19) 'బతుకమ్మ', 'దసరా' పండుగలకు కూడా యిబ్బందికరమౌతుంది. అయితే దేవి పురాణం, రుద్రయామళంలలో పేర్కొన్నవిధంగా ఈ వర్షఋతువులో సంక్రమించే వ్యాధులనుండి ఉపశమనం పొందాలంటే ఈ ఆశ్వీయుజమాసారంభం నుండే ఏ ప్రాంతంలో నివసించే ప్రజలైనప్పటికీ, గౌరీదేవిని పూజించాలని పురాణాలు చెబుతున్నాయంటారు పండితులు. కనుకనే 'దేవీ నవరాత్రులైన' దసరా పండుగ ప్రాముఖ్యతను సంతరించుకుంది. హిందూమత సంప్రదాయంలో ఈ చరాచర సృష్టికి శక్తిస్వరూపిణి 'ఆదిపరాశక్తి' అని పేర్కొనడం ద్వారా దేశమంతా ఒక్కొ రాష్ట్రములో ఒక్కొ విధముగా, వారి వారి జీవనస్థితిగతుల్ని అనుసరించి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆ విధంగా దసరా పండుగ ప్రాశస్త్యం గురించి తెలుసుకుందాం.

## పురాణాల ప్రాశస్త్యం:

దేవి నవరాత్రుల నేపథ్యం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలల్లోను భారతదేశంలోను, ప్రపంచవ్యాప్తంగా హిందువులు చాలా గొప్పగా జరుపుకునే పండుగగా చెప్పుకోవచ్చు. అందుకు పురాణ ఇతిహాసాల్లో అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. దేవీ నవరాత్రుల పరమార్థాలన్నీ ఎంతో ప్రాచీనమైనవని చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. ఆర్యుల ప్రవేశానికి ముందు కాలంలో ద్రావిడులలో స్త్రీకి దేవ్యారాధన విస్తృతంగా ఉండేది. వారు తమ వేట, వ్యవసాయానికి, వృత్తులకు దేవతలను కొలిచేవారు. ఈ ఆచారం నేటికీ గ్రామసీమల్లో దేవతలుగా స్త్రీలనే ఆరాధించడం కనబడుతుంది. ద్రావిడులలో స్త్రీలకు ప్రాధాన్యం ఇచ్చి ఆమె అజమాయిషీలో కుటుంబం నడపబడుతుండేది. నవరాత్రులు సందర్భంగా ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని నవమి వరకు తొమ్మిది రోజులు "దేవీని" భక్తి ప్రపత్తులతో ఆరాధిస్తారు.

ఈ తొమ్మిది రోజులకు 'దేవీ నవరాత్రులు" అన్న పేరు ప్రశస్తమై నిలిచింది. ఈ దేవీ నవరాత్రులనే శరన్నవరాత్రులుగా పేర్కొనడం జరిగింది. తొమ్మిది రోజులు చేసే పూజోత్సవాన్ని వివిధ ప్రాంతాల్లో దేవీ వేరు వేరు పేర్లతో కొలవబడుతుంది. దేవికి తొమ్మిది నామాలలో మూడు రకాలుగా సాత్విక, రాజస, తామస పద్ధతులలో ఈ పూజను చేస్తారు. దేవికి తొమ్మిది రోజులు రకరకాల నైవేద్యాలు సమర్పిస్తారు.

శ్రీరాముడు రావణునితో యుద్ధం చేసేసందర్భంలో రావణుని సంహారం కష్టతరం కావడంతో, ఆ సమయంలో తనకు విజయం సంప్రాప్తిమ్చాలని 'దేవిని' పూజించినట్లుగా చెబుతారు.

ఆ పూజ ఆశ్వీయుజ శుద్ధ ప్రథమ (పాడ్యమి) మొదలుకుని నవమి వరకు తొమ్మిది రోజులు చేసారని పదవ రోజు "దశమి" నాడు రాముడికి రావణ సంహారం జరిగి విజయం లభించిందని పురాణకథ. మన పురాణాలు పరిశీలిస్తే 'దేవి', మహాకాళీ, మహామాయగా అవతరించి మధుకైటభులను సంహరించినందున 'మహిషాసురమర్ధిని', మహా సరస్వతిగా, దేవి ఫాలం నుండి పుట్టినటువంటి చాముండ, సుంభ, నిసుంభులను, రక్త బీజుని వధించిందని, నందుని ఇంట పుట్టిన 'నంద' కంసుడు ఈమెను చంపేందుకు పైకి ఎగురవేయగా ఆమె నీ ప్రాణాన్ని హరించడానికి నీ ప్రాణశత్రువు (శ్రీ కృష్ణుడు) నందుడి ఇంట్లో పెరుగుతున్నాడని హెచ్చరించి మాయమవుతుంది. ఇంకా 'రక్తదంతి' అవతారంలో రాక్షసులను చీల్చివేయడంవల్ల ఈ పేరుతొ కొలుస్తారు. 'శాకాంబరీ' ఒకప్పుడు కరువు ఏర్పడగా పూజలందుకున్నది.

దుర్గ 'దుర్గముడు'అనే రాక్షసుని సంహరించినందువల్ల దుర్గగా పిలవబడుతోంది 'మాతంగి' అవతారంలో అరుణుడనే రాక్షసుడిని భ్రమరాలు (తుమ్మెదల) సాయంతో చంపడంవళ్ళ భ్రమరీ అనే పేరు పొందింది. ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమినాడు కలశస్థాపన చేసి దేవీమూర్తిని అందులో ఆవాహనం చేసి, నవరాత్రి వరకు దీక్షతో దేవీ పూజ చేస్తారు. ఆ విధంగానే కాక దేవీమూర్తిని పెట్టి తొమ్మిది రోజులు పూజలు జరిపి నిమజ్జనం చేయడం కూడా ఆచారంలో ఉంది. శ్రీ చక్ర పూజ కూడా దేవీ పూజా సందర్భంలో జరుపుతారు. ఈ తొమ్మిది రోజులు కన్యకపూజ, సుమంగళీ పూజ, జపహోమాదులతో విశేష పూజలు జరుపుతారు. నవమినాడు 'మహాచండీయాగం' కూడా కొన్ని చోట్ల చేస్తుంటారు. దశమి నాడు ఉదయం 'దేవీ' ప్రస్థానం జరుగుతుంది. మూలానక్షత్రం రోజు సరస్వతి పూజతో నవమి రోజున లోహాభిసారికమంటే రాజ చిహ్నాలను, గజాశ్వాదులను, చాపఖడ్గద్యాయుధాలను పూజించడం దానినే నేడు ఆయుధ పూజగా జరుపుకుంటారు.

## రాజరిక వ్యవస్థలో దేవి ఉపాసన :

మహాభారతంలో కూడా దేవీ ప్రసక్తి రెండు పర్యాయాలు వచ్చింది. పాండవులు విరాటరాజు కొలువుకు వెళ్లబోయే ముందు, యుధిష్టరుడు 'దుర్గను' ప్రార్ధించడం మొదటిది. కురుక్షేత్రం నందు కృష్ణుని సలహాపై అర్జునుడు చేసిన 'దుర్గాస్తుతి' రెండవది. ఈ విధంగా భారత, రామాయణ గ్రంధాలలో దేవి ప్రసక్తి ఆ దేవికి ఉన్న ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. మన పురాణాల్లో లక్ష్మి, పార్వతి, సరస్వతి వీరు ముగ్గురు 'శక్తి' స్వరూపిణికి మూడు అంశలు అని పేర్కొనడం జరిగింది. అలాగే లక్ష్మి,సరస్వతులు వీరిద్దరూ 'దుర్గాదేవి అంశ గలవారని వారిద్దరిని పూజించినచో దుర్గాదేవిని



శ్రీ మహాలక్ష్మీ దేవి | శ్రీ దుర్గా దేవి | శ్రీ రాజరాజేశ్వరి దేవి | శ్రీ మహిషాసుర మర్ధని దేవి

పూజించిన ఫలితం దక్కుతుందని చెప్పబడింది. "కేనోపనిషత్తులో" దుర్గాదేవిని ఈ విధంగా వర్ణించారు. ఆమె ఒక కాంతి పుంజం వంటిదని, జగత్తునకు వెలుగును ఇచ్చే ఆ సూర్యభగవానునే ప్రకాశింప జేయునది ఆమెయేనని, వాయుదేవతని, సమస్త ప్రాణి అన్ని దుర్గామాతయే "సర్వం శక్తిమయం" అనడంలో సందేహం లేదు. సృష్టికంతయు మూలాధారమైన శక్తి స్వరూపమే, పలు విధాలుగా శక్తిమూర్తులై పూజలందుతున్నట్లు, తూర్పు చాళుక్యులు కాలంలో 'కూష్మాండినీ' దేవిగా పూజింపబడింది. కందుకూరి చోడుల కాలంలో ప్రజలు మహిషాసురమర్ధిని, బ్రహ్మీ, మహేశ్వరీ, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండి, సరస్వతి దేవి మొదలైన స్త్రీ దేవతలను పూజించారు. శైవం ఆనాడు ప్రబలంగా ఉండేవి. చాళుక్యులు, చోళులు, పల్లవులు వీళ్లంతా వీరశైవమతానుయాయులు. జంతు బలులు కూడా వీరి కాలంలో ప్రబలంగా ఉండేవి. కాకతీయుల కాలంలో ఏకవీర, రేణుక, చాముండేశ్వరి మొదలగు దేవతలు పూజలందుకున్నారు. వీరి కాలంలో దుర్గాష్టమి పూజలు విశేషంగా వైభవోపేతంగా జరుపబడేవి. గౌరీ, కాకతీ, పద్మాక్షి, కూష్మాండిని పూజలు జరిగేవి. ఆశ్వీయుజ అమావాస్య నుండి అష్టమి వరకు దేవీ పూజలు జరిగేవి. దశమినాడు దసరా పండుగ జరిగేది. ఈ కాలంలో గౌరీ, లక్ష్మి, పార్వతులకు ప్రతిరూపంగా "బతుకమ్మ" పండుగను స్త్రీలు ఆచరించేవారని, పూలబతుకమ్మను దేవతగా, శక్తి స్వరూపిణిగా భావించి పూజించేవారని తెలుస్తుంది. రేణుకాదేవి 'ఎల్లమ్మ' దేవతగా పూజలందుకున్నది. ఈనాటికీ కూడా ఈమె పూజలు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం తెలంగాణ అంతటా రాష్ట్ర పండుగగా ప్రతి వీధిలో, వాడవాడలా, విదేశాల్లో సైతం ఘనంగా జరుపుకుంటున్నారు. కర్ణాటక రాష్ట్రంలో కూడా ఈ పండుగ జరుపుకుంటారు. రేచర్ల పద్మ నాయకుల కాలంలో వైష్ణవం, శైవం కూడా ఉండేవి. వీరి కాలంలో కాళికాదేవి, దుర్గాదేవి, చండి, భద్రకాళి, మహిషాసురమర్దని పూజలు వ్యాప్తిలోకి వచ్చాయి. గ్రామ దేవతలు కట్ట మైసమ్మ, రేణుకమ్మ, మొదలైన వారు ఉండేవారు. రెడ్డి రాజుల కాలంలో కూడా శక్తి పూజలు వ్యాప్తిలోకి వచ్చాయి. పార్వతీదేవి, భద్రకాళి, దుర్గ, చండి, కాళికా రూపాలలో దేవి పూజలందుకుంది. క్రీడాభిరామంలో పరశురాముని తల్లియు-జమదగ్ని భార్య అయిన రేణుకాదేవిని, ఏకవీరా దేవిగా పూజించే వారని, ఆమె పార్వతివలె, ఆదిశక్తి అఖిల వేద వేదాంతసారమని చెప్పబడింది. ఆమె కోపించిన సామ్రాజ్యాలు క్షణంలో నాశనమగునట. శక్తి పూజ తాంత్రిక విధానంతో సంబంధించినది. విజయనగరంలోని నవరాత్రి ఉత్సవాలు చూడడానికి దేశవిదేశాల నుండి ఎంతోమంది యాత్రికులు విజయనగరానికి వచ్చేవారు. ఆ తొమ్మిది రోజులు చక్రవర్తి విజయమంటపానికి ఉదయమే వచ్చి దుర్గపూజ చేసేవాడట. ఆ పూజపుష్పాలు తన ప్రీతి పాత్రములైన గుర్రాలు, ఏనుగుల మీద చల్లి, తర్వాత దుర్గాదేవికి నివేదించిన ప్రసాదాలను స్వీకరించేవారని 'నన్నిజూ' తన చారిత్రక గ్రంథంలో పేర్కొన్నాడు. ఆ విధంగా దేవి ఆరాధన అనాదిగా ఉందని తెలుస్తున్నది. అదిమానవుడి కాలం నుంచే ప్రారంభంమైన దేవీ ఉపాసన ఈ నాటికీ కొనసాగుతూనే ఉంది. దేవి "స్త్రీ శక్తికి" ప్రతిరూపంగా నిలిచి పూజలు అందుకుంటుంది.

## ఇంద్రకీలాద్రిపై అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకి బెజవాడ కనకదుర్గమ్మ :

దక్షిణ భారత దేశంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమై కృతయుగం నాటి కోవెల బెజవాడ దుర్గమ్మ కొలువుండే ప్రధానాలయం బంగారు గోపురంతో ఉంటుంది. శ్రీ చక్ర అధిష్టాన దేవత, పరమ పవిత్రమైన ఇంద్రకీలాద్రి మీద ఇంద్రాది దేవతల కోరిక మీద దుర్గాదేవి మహిషాసురమర్దని స్వరూపంతో స్వయంభూగా వెలసి కోరిన వారికీ కొంగు బంగారమై "బెజవాడ దుర్గమ్మ"గ కీర్తి పొందుతున్నది.

## కనకదుర్గ క్షేత్రంలో దర్శనీయ స్థలాలు:

అమ్మవారి ఆలయానికి ఉత్తర భాగంలో ఉన్న భాగంలో అత్యంత ప్రాచీనమైనఆలయం మల్లేశ్వరస్వామివారి ఆలయం అమ్మవారి భర్త అయిన పరమేశ్వరుడు వెలిసిన ఈ పవిత్రమైన ఆలయంలో అమ్మవారిని దర్శించిన ప్రతిఒక్కరు విధిగా మల్లేశ్వరస్వామివారిని తప్పకుండా దర్శించాలి. క్షేత్రపాలక అంజనేయస్వామి, నాగేంద్రుడిపుట్ట, విఘ్నేశ్వరుడు, నటరాజస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరాలయం, పార్వతి పరమేశ్వరుల కళ్యాణం జరిపే మంటపం ఉంటుంది. ఈ దసరా ఉత్సవాల్లో దేశం నలుమూలల నుండి దుర్గమ్మని దర్శించుకోవాలని తపనపడతారు. లోకకంటకుడైన దుర్గమాసురుడి సంహారానంతరం ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మ మహారౌద్రంగా ఉండేదట. అటువంటి రౌద్ర స్వరూపిణిని పరమశాంతి స్వరూపిణిగా మార్చాలనే సంకల్పంతో శ్రీ జగద్గురు అది శంకరాచార్యులవారు ఇక్కడికి వచ్చి అమ్మవారి సన్నిధిలో శ్రీ చక్ర యంత్రాన్ని స్వయంగా ప్రతిష్టించారు. అంతే ఆనాటి నుండి దుర్గమ్మ భక్తులకు శాంతి స్వరూపిణిగా మారి దర్శనమిస్తుంది.

శ్రీ చక్ర రాజ నిలయా శ్రీమత్రిపుర సుందరీశ్రీ శివా శివ శక్తయిక స్వరూపిణి లలితాంబికా అని లలితాసహస్రనామస్తోత్రంలో చెప్పినట్లుగా సృష్టి స్థితి లయకారిణి అయిన ఆదిశక్తి దుర్గమ్మ పవిత్రమైన లలితా స్వరూపిణీగా నిత్యం లలితాసహస్రనామాలతోనే అర్చించటం జరుగుతోంది. దసరా దుర్గమ్మ దర్శనం శుభకరం. స్త్రీల పసుపు కుంకుమలతో కలకాలం వర్ధిల్లెందుకు, సౌభాగ్యానికి నిత్యం లలితా సహస్రనామ స్తోత్రం పారాయణ చేయాలంటారు.

శుభం భూయాత్!సర్వేజనాః సుఖినో భవంతు!



**-శారద శృంగేరి**
94902 61119

## బతుకమ్మ మొగ్గలు

ఊర్లన్నీపూలవనాలై అలరిస్తుండగా
బతుకమ్మలతో భలే సందడి చేస్తున్నారు మహిళలు.
బతుకమ్మ ఆడపడుచుల ఆనందాలకు ప్రతీక

బతుకునిచ్చేతల్లి బతుకమ్మ అంటూ
పల్లె గల్లీలన్ని పరవశిస్తున్నాయి
బతుకమ్మ అందరి కోర్కెలు తీర్చే కల్పతరువు

అమ్మలక్కలంతా ఒక్కచోటకు చేరి
పసుపుముద్దను చేసి ప్రాణము పోసేరు
బతుకమ్మ అమ్మలకే వేల్పుటమ్మ

అందంగా ముస్తాబైన ఆడపడుచులు
రోజుకో రూపున అమ్మను కొలిచి తరిస్తారు
అమ్మ అందరికీ ఆనందాలు పంచే కల్పవల్లి

అందమైన పూబాలలు ఆనందంతో గంతులేయగా
చప్పట్లతో సందడి చేస్తున్న నవయువతుల నాట్యశోభ.
బతుకమ్మ పండుగ ప్రకృతికే శోభాయమానం.



**-మల్లెఖేడి రామోజీ**
6304718329

## పూలపండుగ

పూలపండుగ పల్లెల్లో ఆనందం తెచ్చింది
ఆడబిడ్డల మనసేమో పుట్టింటికి సాగింది
అందాల పల్లెతల్లి పచ్చకోక కట్టింది
గిరులనడుమ ఊరేమో పూలవనమై విరిసింది
రారండో అక్కల్లారా పూలసంచుల తోడ
రారండో చెల్లెల్లరా బతుకమ్మ ను పేర్చ.

'బాలలంత కూడి బయలెల్లినారో నాగమల్లెలో..
'తీరొక్కపూలకై తరలెళ్ళినారో తీగమల్లెలో..'

చేను చెల్కలకెళ్ళి చేమంతులుతెచ్చి..
కాలువల పంటితిరిగి కట్లపూలుతెచ్చి...
తంగేడు పూలన్ని తట్టల్లో తెచ్చి ముంగిట్లో పోసి..

గుమ్మడి పువ్వులు గునుగులు తెచ్చి
గోడల్లో పూసిన గోరింటతెచ్చి..
సంచెడుపూలతో సంబురపడుతూ...సందిట్లకొచ్చి

'మాపల్లెబాలలు మురిసినారో నాగమల్లెలో..'
'అందాలనవ్వులే కురిపించినారో తీగమల్లెలో..'

ముంగిట్లో పూసిన ముద్దబంతులు తెచ్చి
పక్కింటి వాకిట్లో పోకబంతులు తెంపి
అరుగుల్లో అందాల పూలనే నింపి...కుప్పలు పోసి..

మేదర సిబ్బిని మెరికలల్లే తెచ్చి...
గుమ్మడాకులతోడ పాన్పునే చేసి
తీరొక్కపూలతో తీర్చిదిద్ది..
గౌరమ్మను పెట్టి....

'బతుకమ్మ తల్లిని పేర్చింద్రు చూడు నాగమల్లెలో..'
'ముద్దుగా ముస్తాబె చేసింద్రు చూడు తీగమల్లెలో...'

పట్టుచీరలు కట్టి... నగలను ముద్దుగ పెట్టి..
చప్పట్ల సవ్వడితో...కోలాటమాటల్తో..
ముదితలంతా కూడి.....ఉయ్యాల ఆటాడి...
'పోయిరా తల్లంటు సాగనంపారో తీగమల్లెలో...'
'వాయినాలే ఇచ్చి మురిసినారో నాగమల్లెలో...'



**-స్వప్నకృష్ణ**
9440536669

## బతుకమ్మ పాట

చిట్టి పొట్టి చేతులు కలిపి చిందులు వేయంగా ఓయ్ చిందులు వేయంగా
మమతలూర ఆడపడుచుల పుట్టినింటికి అన్నలు పిలువంగా జల్ది రమ్మని పిలువంగా
తట్టాలల్ల అడవిపూలు ఇంటికి చేరంగా పరుగు పరుగున చేరంగా
వాడ వాడ సంబురంబు పల్లె తల్లి పరవశంబు ఓ మా బతుకమ్మా......
మా బతుకు తెరువు నీవమ్మా (2) !!చిట్టి పొట్టి!!
ప్రకృతితో పొదిగిన అందం. పసుపు పారాణి చందం
పువ్వుల పూజించే ధరణిలో పుట్టిన తెలంగాణ తేజం
మట్టిబిడ్డల ఆటపాటను అవనంతా ఆడించిన వైనం
నిలువెత్తు తరగని రూపం ఓ బతుకమ్మ... సంస్కృతికి తార్కాణం నీవమ్మా !!చిట్టి పొట్టి!!
ఎంగిలి పూలతోడి, అటుకులనాడు పేర్చి, ముద్దబంతి బతుకమ్మ ఆడి
నాన బియ్యం మాట, ఆట్లతో నారగించి, అలిగిన చోట నిలిచి
వేపకాయల పేరు, వెన్నముద్దల బాట, సద్దులతో సాగనంపేదము ఓ బతుకమ్మా
సకలము మమ్ము రక్షించు మా బతుకమ్మా మా ఇలవెల్పు నీవమ్మా !!చిట్టి పొట్టి!!



**-ఉండ్రాళ్ళ రాజేశం**
9966946084



